J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 38 23.02.2024, శుక్రవారం వెల : రూ. 5 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# జగన్‌రెడ్డికి వేమిరెడ్డి గుడ్‌బై!

## ఖంగుతిన్న పార్టీ క్యాడర్

> మేము మీవెంటే అంటున్న వీపీఆర్ సైన్యం

> త్వరలోనే భవిష్యత్ వ్యూహం ప్రకటిస్తానన్న ప్రభాకరరెడ్డి

రెండు వారాల క్రితం 'లాయర్' ఊహించిందే జరిగింది. రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి జగన్‌రెడ్డికి గుడ్‌బై చెప్పేశారు. రాజ్యసభ సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ వీపీఆర్ బుధవారం మధ్యాహ్నం *2* గంటలా *30* నిముషాలకి రాజీనామా చేసేశారు. పార్టీలో తనకి జరుగుతున్న వరుస అవమానాలను తట్టుకోలేక ఆ సేవాభూషణుడు బయట కొచ్చేశారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి దూరమవుతున్నానని ప్రకటించారు.

3 లో

# ఉత్కంఠ ఉత్సాహం

సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలా..

జిల్లా రాజకీయం

ఒక జిల్లా...

వంద ప్రశ్నలు

- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఏ పార్టీలో చేరతారు
- నెల్లూరు పార్లమెంటుకి వైసీపీ, టీడీపీ అభ్యర్థులు ఎవరు
- నగరంలో పోటీ చేసేది నారాయణా లేక జనసేన అభ్యర్థా
- నగర వైసీపీ అభ్యర్థిగా ఖలీలా.. సినీ నటుడు ఆలీనా
- ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరా.. వెంకటగిరా
- సర్వేపల్లిలో దేశం అభ్యర్థిగా మళ్ళీ సోమిరెడ్డే పోటీ చేస్తారా
- కందుకూరులో మహీధర్‌రెడ్డి వైసీపీలోనే ఉంటారా
- కావలి టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డినే కొనసాగిస్తారా
- ఉదయగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థులుగా ఢీకొనబోయేదెవరు
- ఆదాల ప్రభాకరరెడ్డి వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తారా



ఎన్నికల సమయం దగ్గరపడుతున్నకొద్దీ జిల్లాలోని రాజకీయవర్గాలు, రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న మేధావులు, సామాన్య ప్రజలు... పై ప్రశ్నలన్నిటికీ సమాధానాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

"కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు?" అప్పట్లో... అంటే *2015*లో బాహుబలి సినిమా మొదటి భాగం చూసిన ప్రేక్షకులు వేసుకున్న ప్రశ్న ఇది. ఆ ప్రశ్నకి రెండేళ్ల తరువాత అంటే *2017*లో ఆ చిత్రం రెండవ భాగం వచ్చేవరకూ సమాధానం లభించలేదు. ఇప్పుడు అంతకి మించిన సస్పెన్స్‌తో కూడిన ఉత్కంఠ వాతావరణం నెల్లూరుజిల్లా రాజకీయాలలో కొనసాగుతోంది. నోటిఫికేషన్ వచ్చేసి అన్ని పార్టీలూ తమ అభ్యర్థులను ప్రకటించి బి-ఫారాలు ఇచ్చేసినా, వాళ్ళ నామినేషన్ల ఘట్టం ముగిసే వరకూ కూడా పై ప్రశ్నలన్నిటికీ వందశాతం సమాధానాలు లభించే అవకాశమే లేదు. అప్పటివరకూ ఈ రసవత్తర రాజకీయ డ్రామా కొనసాగుతూనే ఉంటుంది. కేవలం... పై ప్రశ్నలే కాకుండా ఇంకా రకరకాల అనుమానాలు, అపోహలు సామాజిక మాధ్యమాలతో పాటు రాజకీయవర్గాలలో చక్కర్లు కొడుతున్నాయి. ఒక్క జిల్లా వంద ప్రశ్నలు అన్నట్లుగా ఇక్కడ రాజకీయం రసవత్తరంగా మారింది.

## వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఏ పార్టీలో చేరతారు?

అందరూ భావించినట్లుగానే వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వైసీపీని వీడారు. ఇప్పుడు ఆయన ఏ పార్టీలో చేరతారు? ప్రస్తుతం రాజకీయవర్గాలలో నడుస్తున్న చర్చ ఇది. తన రాజీనామాని ప్రకటించారే తప్ప భవిష్యత్ కార్యాచరణాన్ని వెల్లడించ లేదు. ఇప్పటికే ఆయన చంద్రబాబుని కలుసుకున్నారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా టీడీపీ నుండి పోటీచేయడానికి సుముఖత చూపించారు అన్న వార్తలు వినపడుతున్నాయి. అయితే, ప్రభాకరరెడ్డి ఆప్తులు చాలామందికి ఆయన టీడీపీకి వెళ్లడం నచ్చడం లేదు. నిన్నటివరకు ముఖ్యమంత్రితో ఒకే టేబుల్ పైన కూర్చుని భోజనం చేయగలిగిన స్థాయి ఉన్న వేమిరెడ్డికి టీడీపీలో ఆ స్థాయి విలువ ఉంటుందా...? అన్నది ఆయన అభిమానుల అనుమానం.

7 లో



# సకల జనరంజకంగా.. టీడీపీ మేనిఫెస్టో

## • మాజీమంత్రి పొంగూరు నారాయణ



రాష్ట్రం అభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ సకల జనరంజకంగా మేనిఫెస్టోను రూపొందిస్తోందని మాజీమంత్రి, నెల్లూరు నగర నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 19న నగరంలోని 9, 10 డివిజన్లలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైకాపా పాలనలో అభివృద్ధి అడుగంటిందని, అవినీతి ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇసుక మాఫియా, మట్టి మాఫియా రాజ్యమేలుతున్నాయని, ప్రకృతి వనరులను సైతం ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. వైకాపా నాయకులు అరాచకాలకు ప్రతినిధులుగా మారారని, తిరిగి రాష్ట్రం బాగుపడాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని రక్షించాలంటే పరిపాలనా దక్షుడైన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలని, వైకాపాను ఓడించి చంద్రబాబును సీఎంగా చేయాలని ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు తిరుమలనాయుడు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# విధ్వంసకర పాలనతో... అరాచకం

## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



అవినీతి, అక్రమాలతో రాష్ట్రంలో వైకాపా విధ్వంసకర, అరాచక పాలన సాగిస్తోందని, విసిగిపోయిన ప్రజలు రానున్న ఎన్నికల్లో వైకాపాకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరు పర్యటనకు వచ్చి, విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, మట్టి మాఫియా, లిక్కర్ మాఫియా, మైనింగ్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని, దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆమె విమర్శించారు. ప్రజల సమస్యలను.. రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోకుండా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటోందని, ఉపాధి హామీ కోసం, గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం ఇస్తున్న కోట్లాదిరూపాయల నిధులను జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆమె మండిపడ్డారు. ఫసల్ బీమా యోజనకు రాష్ట్రప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో రైతాంగం నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 22న బీజేపీ ఆధ్వర్యంలో నెల్లూరులో 'ప్రజాపోరు' కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని ఆమె చెప్పారు. కేంద్ర కమిటీ నిర్ణయం మేరకే ఎన్నికల్లో పొత్తులు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు పార్టీశ్రేణులు సమాయత్తం కావాలని ఆమె పిలుపునిచ్చారు. నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, శీపా వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చగొట్టే ప్రసంగాలతో దాడులు



## - బీద రవిచంద్ర

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ప్రజాస్వామ్య దేశంలో ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నామన్న స్పృహ లేకుండా సభల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తుండడం, చొక్కాలు మడత పెట్టి ప్రతిపక్షాలపై..రాజకీయ విరోధులపై దాడులకు తెగబడేవిధంగా మాట్లాడుతుండడం వల్ల, వైకాపా రౌడీమూకలు రెచ్చిపోయి విచక్షణారహితంగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయని, ఈ అరాచకాలను తెలుగుదేశం పార్టీ ఖండిస్తోందని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్రయాదవ్ ఈనెల 19న నెల్లూరులో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫోటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైకాపా మూకలు దాడులు చేయడం, కాళ్ళతో తన్నడం, కర్రలతో కొట్టడం ఘోరమన్నారు. మీడియాకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సైతం జగన్‌రెడ్డి ప్రభుత్వం హరించి వేయడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

# వైకాపాకు ఓటమి భయం పట్టుకుంది



## - మాజీమంత్రి సోమిరెడ్డి

వైకాపా నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఆ వత్తిడిలో ఏం చేస్తున్నారో వారికే అర్థం కావడం లేదని, చివరికి మీడియాపై కూడా దాడులకు తెగబడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 19న ఒక ప్రకటనలో విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైకాపా సభలో ఓ ప్రముఖ దినపత్రిక ఫోటోగ్రాఫర్‌పై వైకాపా రౌడీమూకలు విచక్షణారహితంగా దాడులకు పాల్పడడం, కర్రలు, రాడ్డులతో తీవ్రంగా కొట్టడం దారుణమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభంగా ఉన్న మీడియాపై ఇటీవలికాలంలో దాడులు పెరిగిపోతున్నాయని, ఇటీవల అమరావతిలో కూడా మరో పత్రిక ఫోటోగ్రాఫర్‌పై దాడి జరగడం వైకాపా ప్రభుత్వ రౌడీయిజానికి పరాకాష్ట అంటూ, మీడియాకే రక్షణ లేకపోతే, ఈ అరాచక ప్రభుత్వంలో ఇక సామాన్యులకు భద్రత ఎక్కడుంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎక్కడకు వెళ్లినా జనసేనకు బ్రహ్మరథం

## - జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి



నెల్లూరు నగరం, రూరల్ నియోజక వర్గాల పరిధిలో ఏ డివిజన్‌కు వెళ్లినా జనసేన నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని జనసేన నెల్లూరు జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని 47వ డివిజన్ కుక్కలగుంట మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నుంచి ఆయన 'జనం కోసం జనసేన' కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి శ్రీమంతుల కిషోర్ ఆధ్వర్యంలో జనసేన నేతలకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ, గత నాలుగున్నర ఏళ్లలో వైసీపీ ప్రభుత్వంలో దౌర్జన్యాలు, దోపిడీలు, అరాచకాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. మరో రెండు నెలలు ఓపిక పడితే తమ ప్రజా ప్రభుత్వం రాబోతుందని, రాష్ట్ర ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. అనంతరం, ఆయన ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. జనసేన జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, నగర ప్రధాన కార్యదర్శి కంతర్, డివిజన్ ఇన్‌చార్జులు శీకాంత్, అజయ్‌బాబు, జీవన్, సుల్తాన్, అలేక్, ప్రతాప్,ఆనంద్, లాలు, వెంకటరమణ, అమెజాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలకు అన్యాయం చేస్తున్న జగన్

## బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుల ఆరోపణ




'వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం' పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు ఆరోపించారు. ఈనెల 21న నెల్లూరులోని జిల్లా పరిశ్రమల కార్యాలయం ఎదుట వారు ధర్నాందోళన నిర్వహించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ మాట్లాడుతూ, గత మూడేళ్ళుగా బడుగు వికాసం లబ్దిదారులకు సబ్సిడీ నిధులు ఇవ్వలేదని, కేంద్రప్రభుత్వం ప్రతిఏటా ఇస్తున్న ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులతోనే ఏపీలో ఎంతోకాలంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా అమలవుతున్న 25 రకాల సంక్షేమ పథకాలను రద్దుచేసి, ఎస్సీల ఆర్థిక మూలాలను దెబ్బతీశారని ఆయన విమర్శించారు. ఈ ఆందోళనలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, నాయకులు మదు, మల్లి రవి, రాజేష్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మీ ఓటు.. మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది

## - సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి




రానున్న ఎన్నికల్లో మీరు వేసే ఓటు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, కనుక యువత బాగా ఆలోచించి ఓటు వేయాలని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 19న ఆయన పొదలకూరు పట్టణంలోని బోగోలు కృష్ణారెడ్డి కళ్యాణ మండపంలో మండల టీడీపీ నాయకులు, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ కళాశాలల డిగ్రీ విద్యార్థులతో, మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్న యువతకు ఓటు పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికలు ఏపీ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. వైకాపా పాలనలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను అవస్థలపాలు చేశారని, ఏపీలోని పరిశ్రమలను, కియా మోటార్స్, అమరరాజా వంటి కంపెనీలను పక్క రాష్ట్రాలకు తరిమేశారని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆయన సీఎం జగన్‌ను విమర్శించారు. అమరావతిని రాజధానిగా నిలుపుకొని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే టీడీపీకి విజయం చేకూర్చాలని, దార్శనికుడు..టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, దేవినేని శరత్, చిరంజీవి, దేగా యశ్వంత్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జగన్‌రెడ్డికి వేమిరెడ్డి గుడ్‌బై!

(మొదటి పేజీ తరువాయి)

## మంచితనం, సేవాతత్వం ఆయన వ్యక్తిత్వం!

వీపీఆర్ అంటే జిల్లాలో ఒక బ్రాండ్. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకి చిరునామా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. గత రెండున్నర దశాబ్దాలకిపైగా జిల్లాలో అనేక అనాథ శరణాలయాలకి, వృద్ధాశ్రమాలకు ఆయన అండగా నిలిచారు. నగరంతో పాటు అనేక గ్రామాలలో పలు దేవాలయాల జీర్ణోద్ధరణకి కృషిచేశారు. ఏసీ స్టేడియం, వీఆర్‌సి మైదానాలలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి వైభవోత్సవాలని, లక్షదీపోత్సవాలని పలు పర్యాయాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. బీసీ హాస్టళ్ల నిర్మాణానికి చేయూతనిచ్చారు. జైల్లో ఖైదీలకి అవసరమైన వసతులు కల్పించారు. జిల్లాలో క్రీడాస్ఫూర్తికి తన వంతు ప్రోత్సాహాన్ని అందించారు. పేదలకి కార్పొరేట్ విద్య, వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక వసతులతో స్కూలుని, క్లినిక్‌ని నిర్మించారు. వీపీఆర్ విద్య అన్న పేరుతో స్థాపించిన విద్యాలయంలో గడచిన ఎనిమిదేళ్లుగా ఎంతోమంది పేద విద్యార్థినీవిద్యార్థులకి ఉచితంగా విద్యని అందించారు. ఇప్పటికీ అందిస్తూనే ఉన్నారు. వీపీఆర్ వైద్యం పేరుతో పేదవాళ్ళకోసం నెలకొల్పిన క్లినిక్‌లో ఒక డాక్టర్ నిత్యం అందుబాటులో ఉంటారు. సాధారణ అనారోగ్యంతో అక్కడికి వచ్చిన పేషంట్లని పరీక్ష చేసి, వారికి అవసరమైన మందులను అందచేసి పంపిస్తారు. ఇదంతా పూర్తిగా ఉచితం. గత ఆరేళ్ళుగా 'వీపీఆర్ అమృతధార' పేరుతో వాటర్ ప్లాంట్లని ఏర్పాటు చేసి జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో సైతం ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే... ఆయన సేవా కార్యక్రమాలకి ఎల్లలు లేవు, హద్దులు ఉండవు, పేజీలు సరిపోవు.

## మరింత సేవ కోసమే రాజకీయాలలోకి!

దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డికి వేమిరెడ్డి అత్యంత ఆత్మీయ ఆంతరంగికుడు. అలాగే, జాతీయ నేత, నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడికి కూడా ఆత్మబంధువు. రాజకీయాలకతీతంగా ఆయన అందరితో స్నేహభావంతో ఉంటారు. అయితే, తన సేవా పరిమళాల్ని మరింత విస్తరించడానికి ఆయన రాజకీయ రంగాన్ని వేదికగా ఎంచుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణం తరువాత జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. జగన్‌మోహన్‌రెడ్డి జైలులో ఉన్న సమయంలో కూడా పార్టీ వ్యవహారాలూ, జగన్ వ్యక్తిగత విషయాలు కొన్ని ప్రభాకరరెడ్డి చూసుకునేవారు. అయితే, 2016లో వీపీఆర్ జగన్ వ్యవహారశైలి నచ్చకపోవడంతో అప్పట్లో తెలుగుదేశంలో చేరడానికి ముహూర్తం పెట్టుకున్నారు. అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రయత్నం ఫలించలేదు. 2017లో 'లాయర్' కుటుంబంలో జరిగిన ఒక పెళ్లి వేడుకలో మళ్ళీ ప్రభాకరరెడ్డి, జగన్ కలుసుకున్నారు. అక్కడి నుండీ వారిద్దరి బంధం గట్టిపడింది. 2018లో జగన్ వేమిరెడ్డిని రాజ్యసభకు పంపించారు. ఆ తరువాత 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలోనూ, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనూ వేమిరెడ్డి కీలక భూమిక పోషించారు. అన్ని విషయాలలో పార్టీకి అండదండలందించారు.

## ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశం!

కొన్ని జిల్లాల సమన్వయకర్తగా, వైఎస్సార్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న ఆ నలుగురిలో ఒకరిగా ఉన్న వీపీఆర్‌ని ఉన్నట్లుండి నెల్లూరుజిల్లా అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టి ఆయనని జిల్లాకి పరిమితం చేశారు ముఖ్యమంత్రి. ఇది వేమిరెడ్డికి జరిగిన అవమానంగా అభిమానులు భావించారు. ఆ తరువాత ఆయన పుట్టినరోజు సందర్భంగా కట్టిన ఫ్లెక్సీలను స్థానిక నేతలు తొలగిస్తే సీఎంఓ చూసీ చూడనట్లుగా వ్యవహరించింది. ఇది ఆయనకి జరిగిన రెండవ అవమానం. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా 2024లో పోటీచేయడానికి ప్రభాకరరెడ్డి పేరుని పార్టీ ప్రకటించింది. ఆయన మంచి మనసుతో స్వాగతించారు. వైసీపీ విజయానికి ఇది తొలి బోణి అని అందరూ భావించారు. సహజంగా పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసేవారు తనతో పాటు తమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అందరు శాసనసభ్యులు గెలవాలనుకుంటారు. వేమిరెడ్డి కూడా అదే అనుకున్నారు. మూడు చోట్ల (నెల్లూరు నగరం కాదు) అభ్యర్థులని మార్చమని సూచించారు. పార్టీ పట్టించుకోలేదు. వారిని గెలిపించే బాధ్యత మాది అంటూ ప్రభాకరరెడ్డికి సర్ది చెప్పారు. సరే అని రాజీపడ్డారు. అంతలోనే జిల్లా అధ్యక్షుడుగా ఉన్న వీపీఆర్‌కి చెప్పకుండానే నగర అభ్యర్థిగా ఖలీల్‌ని పార్టీ అధిష్టానం ప్రకటించేసింది. ఇక్కడ మళ్ళీ అవమానం. చివరి సంఘటనతో వేమిరెడ్డి మనస్తాపం చెందారు, తాను పార్టీకి, పార్టీ పెద్దలకి విలువ ఇచ్చాడు. కానీ, వారి దగ్గర తనకు ప్రాధాన్యత లేదని భావించారు. తన రాజకీయ దిశని మార్చుకోవడానికి నిర్ణయించుకున్నారు. బుధవారం ఉదయం ప్రభాకరరెడ్డి తన రాజీనామాని ముఖ్యమంత్రికి పంపించారు. ఇక్కడితో ఊహాగానాలకు తెరపడింది.

## ఖంగుతిన్న పార్టీ క్యాడర్

వేమిరెడ్డి రాజీనామాతో వైసీపీ క్యాడర్ ఖంగుతినింది. అన్నీ పుకార్లే అనుకుంటున్న సమయంలో ప్రభాకరరెడ్డి నిర్ణయం వైసీపీ శ్రేణులని నిరుత్సాహపరచింది. అజాతశత్రువు, నిస్వార్థపరుడు, నిజాయతీకి నిలువెత్తు రూపం, వివాద రహితుడు, అన్నిటిని మించి జిల్లాలో పార్టీకి గుండెకాయ లాంటి వారు. అలాంటి వ్యక్తి పార్టీని వీడడం వైసీపీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. గతంలో జిల్లాలో అన్నీ సీట్లు తమ కైవసం చేసుకున్న వైసీపీ ఈసారి ఎన్ని సీట్లు సాధిస్తుందన్న సందిగ్ధం పార్టీలో నెలకొంది. పార్టీ నుండి వీపీఆర్ నిష్క్రమించడంతో వైసీపీకి గట్టి దెబ్బ తగులుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



## మేము మీవెంటే అంటున్న వీపీఆర్ సైన్యం

బుధవారం ప్రభాకరరెడ్డి తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నారని తెలిసి, 21వ తేదీ ఉదయం నుండీ వందలాది మంది అభిమానులు ఆయన ఇంటివద్ద గుమిగూడారు. రాజీనామా వార్త మీడియాలో రాగానే మరికొంతమంది మోటారుసైకిళ్ళలో ర్యాలీగా వీపీఆర్ ఇంటికి చేరుకొని ఆయనకి సంఘీభావం ప్రకటించారు. మేమంతా మీ సైన్యం. మీతోనే ... మీ వెంటే మేము అంటూ నినదించారు.



## త్వరలోనే భవిష్యత్ వ్యూహం ప్రకటిస్తామన్న ప్రభాకరరెడ్డి

వేమిరెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు తప్ప, భవిష్యత్తు వ్యూహం ప్రకటించలేదు. త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని చెప్పారు. ఆయన రాజీనామా చేసిన వెంటనే తెలుగుతమ్ముళ్లు ఆయన నివాసంలో వాలిపోయారు. తమ పార్టీలోకి రావలసిందిగా ఆహ్వానించారు. దాదాపుగా ఆయన వచ్చేసినట్లే భావిస్తున్నారు. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థిగా వీపీఆర్ బరిలో ఉండబోతున్నారన్న వార్త గత వారం రోజులుగా ముమ్మరంగా ప్రచారంలో ఉంది. శుభం భూయాత్!





ప్రథమ వర్ధంతి

మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకులు

శ్రీ కొండా కోటారెడ్డి గారు

స్వర్గస్తులై తేది. 23.02.2024 శుక్రవారమునకు
సంవత్సరము నిండుతున్న సందర్భముగా
వారి దివ్యస్మృతులను స్మరించుకుంటూ...
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్ళు

కొండా చంద్రమోహన్‌రెడ్డి - స్వర్ణలత
కొండా రవీంద్రరెడ్డి - అరుణ

మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాలు

దామరమడుగు గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం మండలం.

లాయర్
ఫిబ్రవరి 23, 2024

# 'స్వర్ణం' సాధించారు.. చరిత్ర సృష్టించారు

భారత మహిళలు ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అద్భుత విజయాన్ని సొంతం చేసుకుని ప్రపంచ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సైతం ఆశ్చర్యపడేలా చేశారు. ఈ మెగాటోర్నీలో విజేతగా నిలిచి భారత్‌కు బంగారు పతకం సాధించిపెట్టారు. కనీసం మొదటిదశలోనైనా గెలుస్తామో లేదోనన్న సందేహంతోనే అడుగిడినా, అంచలంచలుగా తమ అద్వితీయ ప్రతిభను నిరూపించుకుంటూ..ఎవరూ ఊహించని విధంగా ప్రత్యర్థి క్రీడాకారిణులను అదరగొట్టారు. ఏకంగా 'స్వర్ణం' సాధించి చరిత్ర సృష్టించారు. ఆసియా టీమ్ చాంపియన్ చరిత్రలోనే ఇది కనీవినీ ఎరుగనిది. భారత్ అమ్మాయిలు ఇలా మెరుపులు మెరిపించి స్వర్ణం ఎగరేసుకుపోతారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు. కానీ, అది నిజమైంది. భారత్ మహిళా క్రీడాకారుల సత్తా ఏమిటో రుజువైంది. ఇప్పటిదాకా కనీసం సెమీఫైనల్స్‌కు కూడా చేరుకోలేని భారత జట్టు.. ఈసారి అంతర్జాతీయ స్థాయిలో విజయపతాకం ఎగురవేయడం, ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం భారత్‌కే గర్వకారణం.

మలేషియాలో ఈనెల 18న జరిగిన ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా క్రీడాకారులు ప్రత్యర్థి జట్లను చిత్తు చేసి అమోఘ విజయం సాధించారు. మొన్న ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు సారధ్యంలోని భారత జట్టు థాయ్‌లాండ్ జట్టుపై 3-2 స్కోరుతో విజయాన్ని సాధించి, దేశానికి తొలిసారిగా పసిడి పతకాన్ని అందించి అందరి ప్రశంసలందుకుంది. ఈ టోర్నీలో చైనా, జపాన్, థాయ్‌లాండ్ వంటి దిగ్గజాల జట్లను ఓడించి బ్యాడ్మింటన్‌లో భారత్‌ను అగ్రశ్రేణిలో నిలబెట్టడం గొప్ప విశేషం. భారత బ్యాడ్మింటన్ స్టార్‌లుగా పేరొందిన సింధు, అశ్వినిలతో పాటు హర్యానాకు చెందిన రైజింగ్ స్టార్.. పదిహేడేళ్ల అనమోల్ కర్బ్ ఎవరూ ఊహించనివిధంగా మిరుమిట్లు గొలిపించే ఆటతీరు ప్రదర్శించి అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది. తొలి లీగ్ మ్యాచ్‌లో చైనా జట్టుపై, క్వార్టర్ ఫైనల్స్‌లో హాంకాంగ్ జట్టుపై విజయం సాధించడం, సెమీ ఫైనల్లో జపాన్ జట్టుపై కూడా భారత్ విజయం సాధించడంలో అన్‌మోల్ పాత్రే కీలకం. జపాన్ జట్టును ఓడించి ఫైనల్స్ దాకా రావడం, థాయ్‌లాండ్‌ను సైతం ఓడించి ఫైనల్స్‌లో గెలుపొందడం దాకా భారత జట్టులో అన్‌మోల్ రికార్డుస్థాయిలో ప్రధాన పాత్ర పోషించడం విశేషం. అదేవిధంగా అస్మిత, పుల్లెల గాయత్రి, త్రిషా జాలీ కూడా అద్భుతంగా రాణించారు. ప్రారంభం నుంచే ప్రపంచశ్రేణి జట్లతో తలపడాల్సి వచ్చింది. గత ఏడాదిన విఫలమైనప్పటికీ భారత్ స్టార్ పీవీ సింధు ఏమాత్రం అధైర్యపడకుండా ఈ టీమ్ చాంపియన్‌షిప్‌లో అసాధారణ ప్రతిభతో ఆడి టీమ్‌ను విజయతీరానికి చేర్చడంలో కృతకృత్యురాలైంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో రెండుసార్లు 21-12, 21-12 తేడాతో ప్రత్యర్థి అయిన సుపనిదను ఓడించి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. రెండవ మ్యాచ్ డబుల్స్‌లో గాయత్రి-త్రిషా జాలీ జట్టు 21-16, 18-21, 21-16 తేడాతో ప్రత్యర్థుల జట్టు జోంగ్ కోల్‌ఫాన్-రవింద జోడీ జట్టును ఓడించారు. దీంతో భారత్ ఆధిక్యత 2-0కి చేరింది. మూడో మ్యాచ్‌లో అస్మిత, ఆ తర్వాత డబుల్స్‌లో శ్రుతి-ప్రియ ఓటమిపాలవడం, రెండో సింగిల్స్‌లో అస్మిత, ప్రత్యర్థి అయిన బుసానన్ చేతిలో పరాజయం పొందడంతో థాయిలాండ్ 1-2తో భారత్ ఆధిక్యం తగ్గింది. రెండో డబుల్స్‌లో శ్రుతి మిశ్రా-ప్రియ జోడీ 11-21, 9-21 స్కోరుతో ప్రత్యర్థి జంట బెన్యపా-సుంతకర్న్ ఐమ్‌సార్డ్ చేతిలో ఓడిపోవడంతో థాయిలాండ్-భారత్‌ల స్కోరు 2-2తో సమమయ్యాయి. దీంతో, ఆఖరి మ్యాచ్.. ఫైనల్స్‌లో పోటీ ప్రారంభం నుంచే అత్యంత ఆసక్తిగా మారింది. ఎవరు గెలుస్తారో ఊహించని స్థితి ఏర్పడింది. విజయాన్ని ఖరారుచేసే నిర్ణయాత్మకమైన ఈ పోరులో, కీలకమైన దశలో భారత యువ బ్యాడ్మింటన్ స్టార్ అన్‌మోల్ కర్బ్ ఆటతీరు అద్భుతంగా ఉండి 21-14, 21-9 తేడాతో ప్రత్యర్థి పోర్‌పిచాపై సంచలనాత్మక విజయం సాధించడంతో భారత్‌కు స్వర్ణం లభించింది. గతంలో 2016, 2020 లలో జరిగిన ఆసియా టీమ్ టోర్నీలో భారత పురుషుల జట్టు కాంస్య పతకాల దాకా వచ్చినా స్వర్ణం సాధించలేక పోయారు. దానినిప్పుడు మహిళలు సాధించారు. విశ్వవిఖ్యాతి గాంచిన క్రీడాకారిణులను కూడా ఓడించి, మన భారత మహిళలు సగర్వంగా స్వర్ణపతకాన్ని చేపట్టారు. భారత్ ఘనకీర్తిని ప్రపంచస్థాయి వేదికపై మార్మోగించి పసిడి పతకాన్ని సాధించి... మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించారు. అందుకే.. ఇది మరింత చరిత్రాత్మక విజయం.




# మీడియాపై దాడులు.. దౌర్జన్యాలు సిగ్గుచేటు..!



ప్రజాస్వామ్య వ్యవస్థలో సమసమాజ స్థాపన కోసం పనిచేసే నాలుగు అత్యంత కీలక వ్యవస్థలలో మీడియా కూడా ఒకటి. అందుకే మీడియాని ఫోర్త్ ఎస్టేట్ అని కూడా సంభోదిస్తారు. సుప్రసిద్ధ బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్ ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ "నాకు దేవుడు వచ్చే జన్మంటూ ఇస్తే.. నేను జర్నలిస్టుగా పుట్టాలనుకుంటున్నాను" అని తన అభిమతాన్ని వ్యక్తం చేశారంటే... సమాజంలో జర్నలిస్టులకి ఉన్న విలువకి ఇంతకంటే పెద్ద ఉదాహరణ అవసరం లేదు. కానీ, అది ఒకప్పటి పరిస్థితి. ఇప్పుడు మీడియా పూర్తిగా మారిపోయింది. మీడియా సంస్థల అధిపతులు తమ స్వప్రయోజనాల కోసం వారి సంస్థలని వేదికలుగా మార్చుకుంటున్నారు. మీడియా విలువలని తాకట్టు పెడుతున్నారు. తమ సంస్థలలో పనిచేసే ఉద్యోగులను తమ వ్యక్తిగత స్వార్థం కోసం బలిచేస్తున్నారు.

సమాజంలో మూలస్థంభాలైన మిగిలిన మూడు వ్యవస్థలు కూడా ఇప్పుడు మీడియాని చిన్నచూపు చూస్తున్నాయి, అంతలా మీడియా విలువలు దిగజారిపోయాయి.

## యాజమాన్యాల స్వార్థానికి సిబ్బంది బలైపోతున్నారు!

ముఖ్యంగా రాజకీయ నాయకులు మీడియాని పురుగులకంటే హీనంగా చూస్తున్నారు. సామాజిక మాధ్యమాలు స్వేచ్ఛగా, ఎలాంటి నియంత్రణ లేకుండా విచ్చలవిడిగా రాజ్యమేలుతున్న తరుణంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రాధాన్యత తగ్గిపోయింది. ముఖ్యంగా ప్రింట్ మీడియా ధోరణే మారిపోయింది. ప్రజలకి ప్రభుత్వాలకి మధ్య వారధులుగా పనిచేయాల్సిన ప్రింట్ మీడియా యాజమాన్యాలు, రాజకీయ నాయకుల తొత్తులుగా మారిపోయాయి. తమ పత్రికలని ఆయా పార్టీల కరపత్రాలుగా మార్చేశాయి. తమకి కావలసిన పార్టీని అధికారంలోకి తెచ్చుకోవడానికి, తమకు కావలసిన పనులను చక్కబెట్టుకోవడానికి, రాజకీయ నాయకుల అడుగులకి మడుగులొత్తుతూ పత్రికలని సంస్థ యజమానులు నడిపిస్తున్నారు.

ఇలాంటి తరుణంలో తమ యాజమాన్యాల చేతుల్లో ఆయా సంస్థల ఉద్యోగులు బానిసలుగా మారక తప్పడంలేదు. వారి సిద్ధాంతాల ప్రకారం పనిచేస్తూ వారి ఆదేశాలను పాటిస్తూ కొంతమంది పాత్రికేయులు తమ విధులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా రాజకీయ గూండాల దాడికి బలైపోతున్నారు. లౌక్యంతో వ్యవహరిస్తూ ఏ ఎండకి ఆ గొడుగు పడుతూ ఇప్పటికే ఎర్నలిస్టులుగా మారిపోయి కోట్లకి పడగలెత్తిన జర్నలిస్టులు కూడా నేటి సమాజంలో లేకపోలేదు. అయితే, మరోవైపు నీతి నిజాయితీలతో, నైతిక విలువలతో బ్రతుకుతూ నెలజీతం వస్తే కానీ పూట గడవని జర్నలిస్టులు కూడా సొసైటీలో చాలామందే ఉన్నారు. ఇటీవల వివిధ సంస్థలలో పనిచేసే ఫోటో గ్రాఫర్లపైనా, విలేఖరులపైనా, వీడియో జర్నలిస్టులపైనా రాజకీయ గూండాలు బరితెగించి దాడులు చేయడం సిగ్గుచేటు. పూర్తిగా అప్రజాస్వామికం.

ఏదైనా పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ పెద్దల ఆదేశాల ప్రకారం అధికార వ్యవస్థ కూడా నడుచుకుంటుంది. ఐఏఎస్, ఐపీఎస్ పాసైన విద్యావంతులు, వివేకవంతులు కూడా రాజకీయ నాయకుల ఆదేశాలకు తలలూపి పనిచేయాల్సిందే. లేదంటే బదిలీయో సస్పెన్షనో ఖాయం. అలాగే, జీవన భృతి కోసం పనిచేసే జర్నలిస్టులు కూడా తమ యాజమాన్యాల పాలసీ ప్రకారం పనిచేయాల్సిందే. ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలలో జగన్‌మోహన్‌రెడ్డిని పొగిడితే ఆ విలేఖరి ఉద్యోగం ఊడుతుంది. అలాగే సాక్షిలో చంద్రబాబుని కీర్తిస్తే సదరు రిపోర్టర్ తలతీసి మొలేస్తారు. యాజమాన్యాల ఆదేశాలని పాటిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టులపైన పార్టీల గూండాలు విచక్షణా రహితంగా దాడిచేయడం సమంజసం కాదు. అంతేకాకుండా సదరు సంస్థల కార్యాలయాలపై పడి విధ్వంసం చేయడం హేయమైన చర్య. ఈ పని ఏ పార్టీ చేసినా సమర్ధనీయం కాదు. గతంలో ఎన్నడూ లేని కొత్త సంప్రదాయాన్ని నేటి రాజకీయపార్టీలు తెరపైకి తెస్తున్నాయి. పొట్టకూటికోసం పనిచేసేవారిని పట్టుకుని కొట్టడం సిగ్గుమాలిన పని. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిని పార్టీ అధినాయకత్వం కూడా క్షమించకూడదు. ఇవ్వాళ ఇతరులకి జరిగింది రేపు మనకి జరగదని గ్యారెంటీ లేదు. ఇలా ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ వెళ్తే జరిగేది రక్తపాతమే తప్ప, దానివల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఒనగూరే ప్రసక్తే లేదు. నియంతృత్వ ధోరణితో పరిపాలన సాగించిన హిట్లర్ వంటివాడు కాలగర్భంలో కలిసిపోయాడు, సద్దాం హుస్సేన్‌ని ప్రజలు మర్చిపోయారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులూ, కార్యకర్తలు వేసే తప్పటడుగులు, తప్పుడు పనులవలన తమ నాయకుల ప్రతిష్ఠకి భంగమే తప్ప పార్టీలకి ప్రయోజనం లేదని గుర్తిస్తే మంచిది!


- రాజశ్రీ

# మైపాడు రోడ్డుకి మోక్షం!

నెల్లూరుజిల్లాలో ఉన్న అత్యంత ప్రసిద్ధి చెందిన విహార యాత్రా కేంద్రం మైపాడు తీరం. అతి పురాతన కాలం నుండి మైపాడు బీచ్ అంటే ప్రసిద్ధి. మైపాడు గ్రామ పరిసరప్రాంతాల నుండి వెళ్లి అనేక మంది ప్రముఖులు దేశ విదేశాల్లో స్థిరపడి ఉన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన మైపాడుకి ఆ చుట్టుపక్కల గ్రామాలకి సరైన రహదారి లేక చాలాకాలంగా యాత్రికులూ, ఆ ప్రాంత వాసులూ నానా అవస్థలు పడేవారు. ఇన్నాళ్ళకి నెల్లూరు మైపాడు రోడ్డుకి మోక్షం కలిగింది. ఈ మార్గాన్ని నాలుగులైన్ల రహదారిగా విస్తరించడానికి కృషిచేసిన దువ్వూరు కళ్యాణ్‌రెడ్డికి, ఆయన అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి, నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించిన కోవూరు ఎంఎల్ఏ ప్రసన్న కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు.

హరికుమార్‌రెడ్డి, గంగపట్నం.

# ప్రమాదకరంగా కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు!




నగరంలో అనేకచోట్ల కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచంలా ఫెన్సింగ్, లేదా చిన్నసైజు గోడలని నిర్మించేవారు. ఇప్పుడు ఎక్కడా అలాంటి పరిస్థితి లేదు. ముఖ్యంగా కొన్నిచోట్ల రోడ్డులో మలుపు తిరగగానే భారీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటున్నాయి. వాహనదారులు సరిగ్గా గమనించుకోకపోతే పెనుప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు చొరవ తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

# కావలి పట్టణమంతా ఫ్లెక్సీల మయం!

విగ్రహాల ఊరుగా పేరుగాంచిన కావలి పట్టణంలో ఇప్పుడు ఫ్లెక్సీల బెడద కూడా ఎక్కువయ్యింది. ముఖ్యంగా ఇక్కడ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న అధికారపార్టీ నాయకుడి ప్రచార ఆర్భాటానికి హద్దులేకుండా పోతోంది. అక్రమంగా సంపాదించిన డబ్బుతో సొంత డబ్బా కొట్టుకుంటూ కావలి మొత్తం ఆయన బొమ్మలతో నింపేశాడు. పట్టణంలోని ప్రధాన మార్గాలన్నీ ఆయనే ఆక్రమించాడు. నాయకుడు ప్రజల మనసుల్లో ఉండాలి. ఇలా లక్షలు తగలేసుకుని కరెంటు స్థంబాలపైనా, గోడలపైనా పెట్టించుకునే ఫ్లెక్సీలలో కాదు!

– పి.రమణయ్య, కావలి.

# "ముద్దు బిడ్డ - దత్తు బిడ్డ" పోలిక బాగుంది!

'పద్మవిభూషణ్' అవార్డుని అందుకోనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని నెల్లూరు ముద్దుబిడ్డగా, సినీనటుడు చిరంజీవిని నెల్లూరు దత్తుబిడ్డగా పోల్చి 'లాయర్'లో రాయడం బావుంది. చిరంజీవి అమ్మమ్మవాళ్ళ ఊరు నెల్లూరు. ఆయన మాతృమూర్తి అంజనాదేవి స్వస్థలం నెల్లూరు నగరం. మన 'లాయర్' రాసినట్లుగా నెల్లూరంటే ఆ కుటుంబానికి ఎనలేని ప్రేమ. మీరు రాసినట్లుగా చిరంజీవి నటజీవితాన్ని మలుపుతిప్పిన 'ఖైదీ' సినిమా నిర్మాత తిరుపతిరెడ్డిదే కాదు, దర్శకులు కోదండరామిరెడ్డిది కూడా నెల్లూరే సుమా!

– ఎల్.సుదర్శనరెడ్డి, హైదరాబాదు.

DEVIREDDY SARADA CHARITABLE TRUST

# కీ॥శే॥ దేవిరెడ్డి శారద గారి 7వ వర్ధంతి

DSR Group

మంచికి మారుపేరుగా నిలచి, ఆప్యాయత అనురాగాలతో... మా గుండెలలో నిలిచిపోయిన అమృతమూర్తి



స్వర్గీయ **దేవిరెడ్డి శారద** గారు

**7వ వర్ధంతి** సందర్భంగా
(తేది 26-02-2024 సోమవారము)
స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త: **దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి**

కుమార్తెలు - అల్లుళ్ళు
ప్రతిమ - పెళ్లకూరు చైతన్యరెడ్డి
షర్మిళ - డాక్టర్ దొడ్ల ప్రతాప్ రెడ్డి
మనుమడు : పెళ్ళకూరు సాహిత్‌రెడ్డి
మనుమరాలు : దొడ్ల క్రితి

మరుదులు - చెల్లెళ్లు
దేవిరెడ్డి దశరథరామిరెడ్డి - అమరావతి
దేవిరెడ్డి రఘురామిరెడ్డి - శోభ
దేవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి - రాజేశ్వరి
మరియు కుటుంబసభ్యులు

## దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు ద్వారా అందించిన సేవలు

### DSCT - హైస్కూలు



6వ తరగతి నుండి
10వ తరగతి వరకు
300 మంది పేద విద్యార్థి,
విద్యార్థినులకు ఉచిత
నాణ్యమైన విద్యతో పాటు
మధ్యాహ్నం భోజనము, పుస్తకములు
మరియు యూనిఫారంలు
ఉచితముగా అందజేస్తున్నాము.

### DSCT - స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్




స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 185 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వబడినది. 30 మంది మహిళలకు బ్యూటీపార్లర్ కోర్సులో శిక్షణ ఇవ్వబడినది. 34 మంది మహిళలకు జర్దోసి మగ్గం కోర్సులో మరియు 152 మంది యువతీయువకులకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వబడినది. భవిష్యత్తులో ట్రస్టు ద్వారా యువతీయువకులకు మరెన్నో నైపుణ్య శిక్షణలు ఇవ్వబడును.

### DSCT - ప్రైమరీ హెల్త్ సెంటర్




హెల్త్ సెంటర్ ద్వారా 14967 మందికి ఉచిత వైద్య సేవలు అందించినాము. మరియు 7270 మందికి తక్కువ ధరతో బ్లడ్ టెస్ట్‌లు నిర్వహించబడినవి. ట్రస్ట్ ద్వారా ప్రముఖ వైద్య నిపుణులతో 3 ఉచిత మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించబడినవి. వీటి ద్వారా 852 మంది ఉచిత వైద్యసేవలు అందుకున్నారు.

### DSCT - కన్వెన్షన్ సెంటర్



కన్వెన్షన్ సెంటర్ నందు వివాహాది శుభకార్యములు, రిసెప్షన్లు, వార్షికోత్సవాలు మరియు వ్యాపార సంబంధిత సమావేశాలు నిర్వహించబడినవి.

**తేది : 26-02-2024 సోమవారము DSCT ట్రస్టులో మెగా రక్తదాన శిబిరం జరుగును.**

దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్, పురిణి - ఇందుపూర్ క్రాస్ రోడ్డు, నార్త్ మోపూరు గ్రామం,
అల్లూరు మండలం. సెల్ : 9154854754 www.devireddytrust.com

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# సమన్వయంతో కృషి చేయాలి



తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కలిసి పనిచేస్తామని గూడూరు తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 18న స్థానిక టీడీపీ కార్యాలయంలో చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన అనేకమంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశంతోనే అభివృద్ధి సాధ్యమని అనేకమంది పార్టీలోకి వస్తున్నారన్నారు. నాయకులు శీలం కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వరరెడ్డి, లీలావతి, రహీం తదితరులు పాల్గొన్నారు.




# వైకాపా గెలుపుకు సహకరించండి

రాబోయే ఎన్నికల్లో వైకాపాని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు పట్టణ సమీపంలోని ముత్తుమ్మారి కళ్యాణ మండపంలో ఈ నెల 18న సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడిమీద ప్రమాణం చేసి చెబుతున్నా తుదిశ్వాస వరకు మీ బిడ్డగా ఉంటా, ఈసారి జరిగే ఎన్నికల్లో నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి అని అభ్యర్థించారు. ఈ సిద్ధం సభకు రూరల్ మండలం నుంచేకాక, పట్టణం నుంచి కూడా పలువురు నేతలు హాజరయ్యారు. స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, గూడూరు ఎంపీపీ గురవయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు కోడూరు మీరారెడ్డి, కోడూరు కల్పలత, యద్దల నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, కొండూరు సునీల్‌రెడ్డి, మగ్దుం మొహిద్దీన్, వైకాపా పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మెట్టా రాధాకృష్ణారెడ్డి, ఎల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 9న జాతీయ
# మెగా లోక్‌అదాలత్



మార్చి 9న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మిపర్వీన్ సుల్తానా బేగం కోరారు. గూడూరులోని కోర్టు ప్రాంగణంలో ఈ నెల 17న నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులన్నీ పరిష్కరించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి, అడిషినల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ లోకనాథం, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శంకరయ్య, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# రక్తదాన శిబిరం



రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 19వ తేదీ గూడూరులోని మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లకు, స్కూలు బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాల గురించి అవగాహన కల్పించారు. ఆర్టీసీ డిపో మేనేజర్, గూడూరు, సూళ్ళూరుపేట మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీజేఏసీ ఆందోళన




ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, 12వ పిఆర్‌సిని ప్రకటించాలని ఏపీజేఏసీ గూడూరు తాలూకా ఛైర్మెన్ ఎస్.వి. శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీన గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏపీజేఏసీ నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి న్యాయబద్ధంగా రావలసిన ఆర్థిక బకాయిలు, దాచుకున్న సొమ్ముల బకాయిలు వందల నుండి వేల కోట్ల రూపాయలకు చేరుకుందని, బకాయిలు ప్రభుత్వ సిబ్బందికి అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అందరికీ మేలుకలిగేలా ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ కార్యదర్శి ఏ.రవి, నాయకులు తనూజ్, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు చిరంజీవి, ఎస్.కె.బాబు, జి.సుధీర్, సుబ్రహ్మణ్యంరాజు, ఎస్.మోహన్ దాస్, ఖాదర్‌బాషా, ఎస్కె బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠ - ఉత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

అదే బీజేపీ అయితే జాతీయస్థాయి నాయకుడిగా ఎదగొచ్చన్నది వారి అభిప్రాయం. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలో మళ్ళీ ఖచ్చితంగా రాబోయేది బీజేపీ అన్న మాట దేశమంతా వినపడుతోంది. అధికారంలో ఉండే జాతీయపార్టీలో ఉంటే ఆ స్థాయి, హుందాతనం వేరే అన్నది వారి భావన.

ప్రత్యక్ష రాజకీయాల నుండి విరమించిన ముప్పవరపు వెంకయ్యనాయుడి పరంపరని కొనసాగించగలిగిన సత్తా, సమర్ధత వీపీఆర్ ఒక్కరికే ఉన్నాయన్నది మేధావుల అభిప్రాయం. చూడాలి మరి ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో, ఎవరి సలహాని పాటిస్తారో?

## నెల్లూరు పార్లమెంటుకి వైసీపీ, టీడీపీ అభ్యర్థులు ఎవరు?




క్షణక్షణం మారుతున్న రాజకీయ సమీకరణలతో అన్ని పార్టీల కార్యకర్తలు అయోమయంలో పడిపోయారు. నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి పోటీచేస్తే వైసీపీ అభ్యర్థి ఎవరు? విజయసాయిరెడ్డి అల్లుడి అన్న పెనాక శరత్‌చంద్రారెడ్డి బరిలో ఉండబోతున్నారని వార్తలు వచ్చాయి. తాము వచ్చే ప్రసక్తే లేదని ఆ కుటుంబ సభ్యులు తమ సన్నిహితుల దగ్గర చెప్తున్నారు. ఒకవేళ వేమిరెడ్డి మనసు మార్చుకుని బీజేపీ వైపు మొగ్గుచూపితే కూడా నెల్లూరు పార్లమెంటు రెండుపార్టీల అభ్యర్థులపై సందిగ్ధం ఏర్పడుతుందని విశ్లేషకులు అంటున్నారు.

## నగరంలో పోటీ చేసేది నారాయణా లేక జనసేన అభ్యర్థా?




ఈసారి నగరంలో నారాయణ గెలుపు ఖాయం అన్న మాట చాలా రోజులుగా వినపడుతోంది. అయితే, జనసేన – టీడీపీ పొత్తు క్రమంలో నగరం జనసేనకు కేటాయిస్తారని ఆ పార్టీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. అదే జరిగితే నగరంలో చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి అభ్యర్థి అయ్యే ఛాన్సు కూడా లేకపోలేదంటున్నారు.

## నగర వైసీపీ అభ్యర్థి ఖలీలా.. సినీ నటుడు ఆలీనా?




నగర అసెంబ్లీ అభ్యర్థిగా ఖలీల్ పేరు ప్రకటించినప్పటి నుండి వైసీపీలో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమయింది. నారాయణతో ఢీ కొనగల స్థాయి ఖలీల్‌కి లేదని వైసీపీ వర్గాలే బాహాటంగా మాట్లాడుకుంటున్నాయి. నిఘావర్గాల ద్వారా సమాచారం తెప్పించుకున్న పార్టీ అధిష్టానం, నగర అభ్యర్థి విషయమై పునః పరిశీలిస్తోందని అంటున్నారు. ఖలీల్‌కి బదులుగా సినీ నటుడు అలీని బరిలో దింపుతారని తాజా సమాచారం.

## ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరా... వెంకటగిరా?




ఆత్మకూరు దేశం అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి పేరు దాదాపుగా ఖాయమైపోయిందని టీడీపీ శ్రేణులు చెప్తున్నారు. అయితే, ఆయన మాత్రం తనకి వెంకటగిరే కావాలని మొండికేస్తున్నారని అంటున్నారు. అక్కడ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న కురుగొండ్ల రామకృష్ణని కాదని రామనారాయణకి సీటు కేటాయిస్తారా? అన్నది కూడా మిలియన్ డాలర్ల ప్రశ్న.

## సర్వేపల్లిలో దేశం అభ్యర్థిగా మళ్ళీ సోమిరెడ్డే పోటీచేస్తారా?




గత ఏడాది జరిగిన మహానాడులో ఎక్కువసార్లు ఓడిపోయిన వారికి పార్టీ టిక్కెట్టు ఇవ్వబోదని చిన్నబాబు లోకేష్ ప్రకటించాడు. అదే పాలసీగా తీసుకుంటే సర్వేపల్లిలో చంద్రమోహన్‌రెడ్డికి టిక్కెట్టు వచ్చే అవకాశమే లేదు. తొలినుండీ పార్టీకి విధేయులుగా వున్న వారి విషయంలో ఆ నిబంధన సడలిస్తారా లేదా కఠినంగా పాటిస్తారా..? అన్నది వేచి చూడాలి. ఒకవేళ ఖచ్చితంగా పాటిస్తే సర్వేపల్లిలో కాకాణిని ఢీ కొనగల సత్తావున్న టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి తప్ప ఇంకెవరున్నారు? అన్నది కూడా సందిగ్ధమే.

## కందుకూరులో మహీధర్‌రెడ్డి వైసీపీలోనే ఉంటారా?




కొత్తగా నెల్లూరుజిల్లాలో చేరిన కందుకూరు నియోజకవర్గంలో కూడా అయోమయం నెలకొని ఉంది. మహీధర్‌రెడ్డిని పక్కనపెట్టి ఇక్కడ బీసీ కోటాలో వంకి పెంచలయ్య కుమార్తె కటారి అరవింద యాదవ్‌ని అభ్యర్థిగా వైసీపీ ప్రకటించింది. ఆమె విజయానికి తనవంతు సహకరిస్తానని మహీధర్‌రెడ్డి పైకి ప్రకటించినా, లోలోపల రగిలి పోతున్నాడని ఆయన అనుయాయులు చెప్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ఆయన వైసీపీలో కొనసాగడం కష్టమే అంటున్నారు. వేమిరెడ్డి నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగితే మహీధర్‌రెడ్డి కూడా ఆయనతో జతకట్టే అవకాశాలు లేకపోలేదన్నది వారి అభిప్రాయం.

## కావలి టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డినే కొనసాగిస్తారా?

కావలి తెదేపా అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డికి ఆ పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కావలి నియోజకవర్గం పైన కూడా వేమిరెడ్డి ప్రభావం పడే అవకాశం ఉంది. కావ్యతో వేమిరెడ్డికి మంచి సంబంధాలే ఉన్నాయి కాబట్టి ఆయనని మార్చమని అడగకపోవచ్చుని కావ్య కృష్ణారెడ్డి కోటరీ నుండి వస్తున్న సమాచారం. అయితే, ఇక్కడ నుండి వీపీఆర్ సతీమణి ప్రశాంతిరెడ్డిని




రంగంలో దింపే ఆలోచన కూడా ఆ పార్టీ అధిష్టానం పరిశీలనలో ఉందంటున్నారు. ఒకే కుటుంబానికి రెండు టిక్కెట్లు ఇవ్వబోమన్న సిద్ధాంతాన్ని కూడా టీడీపీ అవలంభించాలనుకుంటోంది. అయితే, చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణ అంతా ఒకే కుటుంబం కాదా అన్న ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతుంది కాబట్టి, ఆ సిద్ధాంతాన్ని అటకెక్కిస్తారని కూడా పార్టీ వర్గాలు అంటున్నాయి. కావలిలో కూడా చివరివరకు సస్పెన్స్ కొనసాగే అవకాశాలు ఎక్కువే.

## ఉదయగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థులుగా ఢీకొనబోయేదెవరు?




ఉదయగిరిలో కాకర్ల సురేష్, బొల్లినేని రామారావులు టీడీపీ టిక్కెట్టు ఆశిస్తున్నారు. ఇక్కడ కాకర్ల సురేష్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయంటున్నాయి పార్టీ వర్గాలు. రామారావు 2019 తరువాత నియోజకవర్గాన్ని పూర్తిగా మర్చిపోయాడంటున్నారు అక్కడ స్థానికులు. కాకర్ల గత రెండేళ్లుగా ఉదయగిరి నియోజకవర్గాన్నే కనిపెట్టుకుని అక్కడ ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకున్నాడని అంటున్నారు. ఇక వైసీపీ తరపున ఆ పార్టీ బరిలో దింపాలనుకుంటున్న మేకపాటి రాజగోపాలరెడ్డి రాజకీయాలకి పూర్తిగా కొత్త. ప్రజలతో సంబంధాలు లేని వ్యక్తి. మేకపాటి అన్న ఇంటిపేరు తప్ప మరే ఇతర అర్హతా ఆయనకి లేవంటున్నారు ఉదయగిరి ప్రజలు. అభ్యర్థిని మారిస్తే తప్ప మా చూపు వైసీపీ వైపు ఉండదని ఖరాఖండిగా చెప్తున్నారని ఇటీవల అక్కడ సర్వేచేసిన ఒక సంస్థ ప్రతినిధి చెప్పిన సమాచారం. కాబట్టి, ఇక్కడా వైసీపీ పునరాలోచన చేయొచ్చు.


## ఆదాల ప్రభాకరరెడ్డి వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తారా?



వేమిరెడ్డి పార్టీని వీడిన క్రమంలో జిల్లా రాజకీయాలలో అనూహ్య మార్పులు సంతరించుకోనున్నాయన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఈ పరిస్థితులలో ఆదాల ప్రభాకరరెడ్డి రూరల్ అభ్యర్థిగానే పోటీ చేస్తారా? లేక పార్టీ పార్లమెంటుకి పోటీ చేయమంటే పునరాలోచనలో పడతారా?? అన్నది ప్రశ్నార్ధకం. ఆయన నామినేషన్ వేసే వరకు సందిగ్ధ పరిస్థితే ఉంటుందన్నది ఆ పార్టీ శ్రేణుల అభిప్రాయం. వీపీఆర్ టీడీపీ పార్లమెంటు అభ్యర్థి అయితే ఆయనని ఢీ కొనగలిగేది ఆదాల ఒక్కరే అంటున్నారు పార్టీ శ్రేణులు. కానీ, వీపీఆర్‌పై పోటీ చేయడానికి ఏపీఆర్ సుముఖత చూపిస్తారా లేదా? అన్నది భేతాళ ప్రశ్న!

ఇదీ, ప్రస్తుతం నెల్లూరుజిల్లాలో నెలకొనివున్న రాజకీయ వాతావరణం. ఖచ్చితంగా పాత నెల్లూరు జిల్లా.. ప్రకారం మొత్తం పదికి పది సీట్లలో వైసీపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఆశపడ్డ జిల్లా గందరగోళ పరిస్థితులలో పడిపోయింది. ఇప్పుడు కొత్త జిల్లాల ప్రకారం నెల్లూరుజిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలున్నాయి. ఎనిమిదిలో వైసీపీ ఎన్ని గెలుస్తుందో? అన్న మీమాంస ఇప్పుడు ఆ పార్టీ శ్రేణుల్లో స్పష్టంగా కనపడుతోంది.

ఓవైపు ఉత్కంఠ, మరోవైపు ఉత్సాహంతో సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలా జిల్లా రాజకీయం క్షణ.. క్షణం మారుతోంది!

# పాత్రికేయులపై దాడులు దుర్మార్గం

## - టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి



పాత్రికేయులపై వైకాపా నాయకులు దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతుండడం దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. ఈనెల 20న నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైకాపా నాయకుల అరాచకాలు, ఇసుక దోపిడీలు బయటపెట్టేందుకు సాహసిస్తున్న విలేకర్లపై, ఫోటోగ్రాఫర్లపై దాడులకు తెగబడడం వైకాపా వారి అరాచకాలకు నిదర్శనమన్నారు. పాత్రికేయులపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వారిని వెంటనే గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పేదలకు అన్నదానం.. దుప్పట్లు పంపిణీ



దివంగత నేత స్వర్గీయ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 20న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ నేతృత్వంలో కేకు కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం పేదలకు అన్నదానం చేసి, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మహోన్నత నాయకుడని, ముఖ్యమంత్రిగా ఉండగా రాష్ట్రప్రజలకు ఎనలేని సేవలందించారని, తన జీవితకాలమంతా పేదల అభ్యున్నతికి కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావు, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, అరవ రామ్మోహన్‌రావు, ఎస్‌కె ఫయాజ్, అల్లాఉద్దీన్, ముదిగొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. మెగా వైద్యశిబిరం



నెల్లూరులోని ఏసీ స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ ప్రేమ్‌దీప్, డాక్టర్ మనోజ్‌కుమార్ పాల్గొని వ్యాధుల పట్ల వాకర్స్‌కు అవగాహన కలిగించారు. శుభమస్తు షాపింగ్ మాల్ వారి దాతృత్వంతో, కిమ్స్ హాస్పిటల్ హార్ట్ స్పెషలిస్టు డాక్టర్ శ్రీనివాసరాజు సలహాతో మందులిచ్చారు. గుండెనొప్పి వచ్చినప్పుడు ముందుజాగ్రత్తగా వేసుకోవాల్సిన మందులను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి నజీర్ అహమ్మద్, కోశాధికారి ఎస్.సుబ్బరాయుడు, నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

# వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమపథకాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 21న ఆయన నెల్లూరులోని విజయమహల్ గేటు వద్ద ఓ కళ్యాణమండపంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించి, నగర నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లకు చెందిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నగర వైకాపా పరిశీలకునిగా..పర్వతరెడ్డి

నెల్లూరు నగర వైకాపా పరిశీలకునిగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పర్వతరెడ్డి నియామకం జరిగింది. రానున్న ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గంలో ఆయన వైకాపా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని పార్టీ అధిష్టానం ఈనెల 21న ఒక ప్రకటనలో పేర్కొంది.

# పద్యాల పోటీల విజేతలకు బహుమతులు




మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నెల్లూరులోని కొండాయపాళెం వద్ద ఉన్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. 5వ తరగతికి చెందిన విద్యార్థిని శృతి ప్రథమస్థానం సాధించగా, సంజన, కుసుమప్రియ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, రాశి తదితరులు విజేతలైన విద్యార్థులకు బహుమతులిచ్చారు.

# శ్రీవారి సేవలకు ప్రత్యక్ష వ్యాఖ్యానం

- ఇద్దరు నెల్లూరీయులకు అవకాశం





రథసప్తమి సందర్భంగా కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఈనెల 16న జరిగిన సప్తవాహన సేవల్లో ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసేందుకు ఈ సారి నెల్లూరీయులు ఇద్దరికి అవకాశం లభించింది. స్వామివారి హనుమంత వాహన సేవకు ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ వ్యాఖ్యానం చేయగా, కల్పవృక్షవాహనం-చంద్రప్రభ వాహనసేవలకు ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అదే రోజు ఉదయం తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానంలో జరిగిన హంస వాహన సేవకు కూడా బొగ్గరపు వ్యాఖ్యాతగా ఉన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆహ్వానం మేరకు వారు రథసప్తమి పుణ్యదినాన తిరుమలలో స్వామివారి సేవలకు వ్యాఖ్యాతలుగా ఉండడం ఎంతైనా అరుదైన విశేషమే. టిటిడి ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా వీరు పాలుపంచుకోవడం తెలిసిందే. శ్రీవారి అనుగ్రహంతో తమకు ఈ భాగ్యం కలిగిందని వారు సంతోషిస్తున్నారు కూడా.



# విపిఆర్‌కు.. పేదరైతుల ధన్యవాదాలు

ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్ళి, తమకు భూ పరిహారం ఇప్పించేందుకు చొరవ తీసుకున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈనెల 18న నెల్లూరులోని ఆయన నివాసంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం కొమ్మరపూడి గ్రామానికి చెందిన పలువురు పేదరైతులు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. జగనన్న కాలనీకి సంబంధించి భూసేకరణ పరిహారం బకాయిలపై పలువురు రైతులు గతంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. కొందరు రైతులకు పరిహారం వచ్చిందని, మరో 62 మంది రైతుల భూములకు పరిహారం ఇంకా జమ కాలేదని ఆయన దృష్టికి తెచ్చారు. అందుకు స్పందించిన విపిఆర్, ప్రభుత్వంతో సంప్రదించి పేద రైతులకు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 62 మంది రైతుల భూములకు సంబంధించి రూ.7.70 కోట్లు ఆ పేదరైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవడం పట్ల పేదప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# ఓటు వినియోగంపై అవగాహన

నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21న విద్యార్థులకు ఓటు నమోదు, ఓటు వినియోగాలపై అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ పుల్లయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికల సంఘం వారు 18 ఏళ్ళు నిండిన వారందరికీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదయ్యే అవకాశం కల్పించిందని, ఓటు హక్కు పొందని విద్యార్థులు నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్‌లో ఫారం-6 ద్వారా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వర్మ, శివ, బిఎల్ఓ సూపర్‌వైజర్ అబ్దుల్‌రహీమ్, శ్రీనివాసులు, విజయ, బిందు మాధవి, ప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరపురంలో..

# కొత్తగా విద్యుత్ కార్యాలయం

నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురంలో కొత్తగా విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 11 విద్యుత్ కార్యాలయాలున్నాయి. ప్రజల సౌకర్యం దృష్ట్యా వెంకటేశ్వరపురంలో మరో కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండి హరనాథరావు ఈనెల 21న ఆదేశాలిచ్చారు. ఆమేరకు ఏర్పడబోయే కొత్త కార్యాలయంలో విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్‌తో పాటు, సిబ్బందిని కూడా నియమించనున్నారు.

## సమస్యలు తీర్చాలంటూ

# ఉద్యోగుల భారీ ర్యాలీ



ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 20న నెల్లూరులోని సర్వోదయ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ నగదును ప్రభుత్వం వెంటనే మంజూరుచేయాలని ఈ సందర్భంగా ఏపీజేఏసీ వైస్‌ఛైర్మెన్, రాష్ట్ర ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శోభన్ బాబు కోరారు. అదేవిధంగా 11వ పీఆర్‌సి బకాయిలు చెల్లించాలని, మెడికల్ రీఇంబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో ఏపీఎన్జీఓల జిల్లా సంఘం అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, కోశాధికారి బందారుపల్లి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయ వర్మ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# వెంకటగిరి అభివృద్ధే నా ధ్యేయం

## నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి వేడుకల్లో రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన తండ్రి దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శాశ్వతమైన అభివృద్ధికి తోడ్పాటును అందించినట్లుగానే తాను కూడా వారి స్ఫూర్తితో వెంకటగిరి పురోగతికి బాటలు వేస్తానని, వెంకటగిరి తనకు మరో పుట్టినిల్లని, వెంకటగిరి అభివృద్ధికి నేదురుమల్లి కుటుంబం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. తమ తండ్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 89వ జయంతిని పురస్కరించుకొని వెంకటగిరిలో ఈనెల 20న పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటగిరి వైద్యశాలలో చికిత్స చేయించుకుంటున్న రోగులకు బ్రెడ్‌లు, పండ్లు పంపిణీ చేశారు. తమ తండ్రి స్మారకంగా, స్ఫూర్తిదాయకంగా రక్తదాన శిబిరం నిర్వహించి స్వయంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రక్తదానం చేశారు. అనంతరం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి ఉన్న అనుబంధం నేటికీ కొనసాగుతూ, తమకు వెంకటగిరితో మంచి ఆత్మీయతానుబంధం కలిగిందన్నారు. తమ తల్లిదండ్రులను వెంకటగిరి ప్రజలు ఆశీర్వదించినట్లే ఈసారి ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మరోసారి సీఎం కానున్నారని ఆయన ధీమా వ్యక్తంచేస్తూ, వెంకటగిరి పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

### తండ్రికి తనయుని వందనం :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో రామ్ కుమార్‌రెడ్డి తమ తండ్రి జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం త్రిభువని సెంటర్లోని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

### జయంతి వేడుకల్లో కుటుంబసభ్యులు :



వెంకటగిరి మున్సిపాలిటీ రాణిపేట పరిధిలోని బాల సదనంలో నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జయంతి వేడుకలను కుటుంబ సమేతంగా జరుపుకున్నారు. కుటుంబసభ్యులు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నేదురుమల్లి కుటుంబీకులు చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసి భోజనం పెట్టారు.

# పెద్దాయన సేవలు చిరస్మరణీయం

## - ఎమ్మెల్సీ మేరిగ మురళి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, స్వర్గీయ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ మేరిగ మురళి కొనియాడారు. ఈనెల 20న జనార్దన్‌రెడ్డి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో పెద్దఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళి పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి జనార్దన్‌రెడ్డి చేసిన సేవలు ఏనాటికీ మరచిపోలేనివని, ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల పురోగతికి కూడా ఆయనెంతో సహకరించారని, అదేవిధంగా ఆయన తనయుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కూడా తండ్రి బాటలో పయనిస్తూ అటు రాష్ట్రానికి, ఇటు జిల్లాలో విద్యాభివృద్ధికి అహరహం కృషిచేస్తుండడం సంతోషదాయకమన్నారు. ఈ రక్తదాన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఎన్‌బికెఆర్ విద్యార్థులు, బోధన-బోధనేతర సిబ్బంది, నేదురుమల్లి అభిమానులు, బంధువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాతల నుంచి మొత్తంగా 602 యూనిట్ల రక్తాన్ని సేకరించడం విశేషం. ఈ కార్యక్రమంలో నాయకులు కొడవలూరు భక్తవత్సలరెడ్డి, షనిల్‌రెడ్డి, ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించారు.

# శ్రీశైల మల్లన్నకు.. పసిడికాంతుల 'స్వర్ణరథం'

## భక్తితో బహూకరించిన వేమిరెడ్డి దంపతులు



ప్రఖ్యాత శైవక్షేత్రం, జ్యోతిర్లింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామికి అత్యద్భుతమైన స్వర్ణరథాన్ని సమర్పించుకుని తమ దైవభక్తిని చాటుకున్నారు రాజ్యసభ సభ్యులు..సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఇటీవల రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని, తన సతీమణి.. తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహా కమిటీ-న్యూ ఢిల్లీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి ఆయన ఆ దివ్యరథాన్ని ఆలయానికి తమ వితరణగా అందజేశారు. సర్వాంగసుందరంగా నిర్మితమైన ఆ స్వర్ణరథం విలువ సుమారు 11కోట్ల రూపాయల వరకు ఉండవచ్చని భక్తులు భావిస్తున్నారు. 23.6 అడుగుల ఎత్తుతో రూపొందించిన ఈ బంగారు రథం మధ్యలో పార్వతీపరమేశ్వరులు, గణపతి, కుమార స్వామిలతో పాటు, దిగువభాగంలో బ్రహ్మ తదితర దేవతామూర్తులను అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. పసిడికాంతులతో ధగధగా మెరిసిపోతున్న ఆ రథానికి శ్రీశైల దేవస్థానం అర్చకులు, వేద పండితులు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం, తొలిసారిగా స్వర్ణరథోత్సవాన్ని ప్రారంభించి, ప్రధానమైన దేవాలయం వద్ద నుంచి నంది మందిరం వరకు ఆ ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఇప్పటివరకు శ్రీశైల దేవస్థానానికి వెండిరథం మాత్రమే ఉండేది. బంగారు రథం లేదనే కొరత దీనితో తీరిపోయింది. ఇకనుంచి స్వామివారు-అమ్మవారు స్వర్ణరథంపై వేంచేపు చేసి భక్తులకు దర్శనమిస్తుండడంతో భక్తలోకం సంబరపడిపోతోంది. మహాపుణ్యక్షేత్రంగా ఖ్యాతిగాంచిన శ్రీశైల దేవస్థానానికి కోట్లాదిరూపాయల విలువగల స్వర్ణరథాన్ని బహూకరించినందుకు సంతోషిస్తూ, ఈ కార్యక్రమంలో పాల్గొన్న దేవాదాయశాఖ మంత్రి కె.సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవాదాయ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మెన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, ఇఓ పెద్దిరాజు, పిఆర్‌ఓ శ్రీనివాసరావు తదితరులు దాతలైన వేమిరెడ్డి దంపతులను ఘనంగా స్వాగతించి గౌరవించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించిన అనంతరం, వేమిరెడ్డి దంపతులు ఆలయ అర్చకుల ఆశీర్వచనాలను అందుకున్నారు.

# జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయం ఛైర్మెన్‌గా.. మావులూరు

## • కొలువుదీరిన పాలకమండలి



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. జొన్నవాడలో వెలసివున్న శ్రీ మల్లికార్జునస్వామి-కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి, వరదరాజస్వామి దేవస్థానానికి నూతన పాలకమండళ్ళ ప్రమాణస్వీకారోత్సవం ఇటీవల జొన్నవాడలోని కామాక్షమ్మ ఆలయం ఆవరణంలో ఘనంగా జరిగింది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జొన్నవాడ దేవాలయం ఛైర్మెన్‌గా ఎన్నికైన మావులూరు శ్రీనివాసులురెడ్డిని, వరదరాజస్వామి దేవాలయం ఛైర్మెన్‌గా ఎంపికైన సాగర్‌ను, పాలకమండలి సభ్యులను ఎమ్మెల్యే ప్రసన్న అభినందించారు. పాలకమండళ్ళలోని వారంతా భక్తిభావంతో సేవలు చేయాలని చెప్పారు. ఆలయాల అభివృద్ధికి అందరూ కృషిచేయాలని ఆయన సూచించారు.

### పాలకమండలి

జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి దేవాలయానికి పాలకమండలి ఛైర్మెన్‌గా మావులూరు శ్రీనివాసులురెడ్డి, సభ్యులుగా గాజుల సుజన, బట్టేపాటి విజయమ్మ, ఆములూరు విమల, ఇన్నమూరు త్రిశూల లక్ష్మి, గుమ్మా రఘురామయ్య, కోటంరెడ్డి రాఘవరెడ్డి, ముంగర శివకుమార్, సూరాయపాళెం రామకృష్ణ, ఎక్స్‌అఫిషియో సభ్యునిగా సిహెచ్ వెంకటకామేశ్వరప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు.

### వరదరాజస్వామి ఆలయ పాలకవర్గం :

అదేవిధంగా, జొన్నవాడలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజస్వామి దేవాలయానికి కొత్త పాలకమండలి ఛైర్మెన్‌గా పిల్లెళ్ళ సాగర్ ప్రమాణ స్వీకారం చేయగా, సభ్యులుగా రాపూరు సుబ్బమ్మ, శింగిరి సుమతి, ఇండ్ల రమణయ్య, పుట్టా మల్లికార్జున, పిల్లెళ్ళ శ్రీలక్ష్మి, నెల్లూరు మల్లికార్జున, ఎక్స్‌అఫిషియో సభ్యునిగా పరాంకుశం తేజాస్వరూప్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ గిరికృష్ణ, డిఏఏబి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డిసిఎమ్మెస్ ఛైర్మెన్ వీరి చలపతి, ఏపీఎల్డీఏ ఛైర్మెన్ గొల్లపల్లి విజయకుమార్, వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, యువనేత నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానాన్ని ప్రోత్సహించాలి

రక్తదాన మంటే ప్రాణదానమేనని, ఒక్కరు చేసే రక్తదానం వల్ల ముగ్గురు బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 20న నెల్లూరులోని రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఆయన 48వ సారి రక్తదానం చేశారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు.






### స్వర్గీయ దేవిరెడ్డి శారద స్మారకంగా..

# 26న.. మెగా రక్తదాన శిబిరం

ప్రముఖ విద్యాదాత.. మంచికి మారు పేరుగా నిలచిన స్వర్గీయ దేవిరెడ్డి శారద 7వ వర్ధంతి సందర్భంగా ఈనెల 26న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని డిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. దాతృత్వానికి పేరుగాంచిన దేవిరెడ్డి శారద కుటుంబసభ్యులు ఆమె పేరుమీద గత కొంతకాలంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అల్లూరు మండలం నార్త్ మోపూరు గ్రామంలో ఇందుపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆరోజున మెగా రక్తదానశిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నారు.

## సామాజిక సేవలో తరిస్తున్న డిఎస్ఆర్ ట్రస్ట్

ఇప్పటికే ఈ ట్రస్టు ద్వారా అనేక సామాజిక సేవలు నిర్వహిస్తుండడం అందరికీ తెలిసిందే. పేదలకు విద్యను అందుబాటులోకి తేవాలనే సదాశయంతో 6 నుండి 10వ తరగతి వరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు, వారికి మధ్యాహ్నభోజనం, పుస్తకాలు, యూనిఫాంలు డిఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఉచితంగా అందజేసి ఉన్నారు. అదేవిధంగా డిఎస్ఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 185 మంది మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చారు. మరో 30 మంది మహిళలకు బ్యూటీపార్లర్ కోర్సులో, 34 మందికి జర్గోసి మగ్గం కోర్సులోను, 152 మంది యువతీయువకులకు కంప్యూటర్ శిక్షణలు ఇచ్చి వారు జీవితంలో రాణించేవిధంగా చేయూతనందించారు. డిఎస్సార్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ద్వారా 14, 967 మందికి ఉచిత వైద్యసేవలందించారు. మరో 7270 మందికి తక్కువ ధరతోనే రక్తపరీక్షలు చేశారు. ప్రముఖ వైద్యనిపుణులతో ఇప్పటివరకు 3 ఉచిత మెగాక్యాంపులు నిర్వహించి, 852 మందికి వైద్యసేవలందించడం జరిగింది. దేవిరెడ్డి శారద చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా అందుతున్న సేవలు ఎంతోమంది పేదలకు ఉపయోగపడుతుండడం పట్ల స్థానిక ప్రజలు ఆ సంస్థ సేవలు నిరుపమానమంటూ కొనియాడుతున్నారు.

# అబ్బాయికి.. బాబాయి కృతజ్ఞతలు!



రాజ్యసభ సభ్యుడిగా ధ్రువీకరణ పత్రం అందుకున్న సందర్భంగా తన సతీమణి స్వర్ణలత, చిన్నబ్బాయి విక్రాంత్‌రెడ్డిలతో తన పెద్దబ్బాయి జగన్‌ని ఆయన నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలియచేస్తున్న సీఎం బాబాయి వై.వీ.సుబ్బారెడ్డి.

# కావలిలో.. వేడుకగా తెలుగు భాషా దినోత్సవం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న కావలిలోని దివంగత బీవీ రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగుభాషకు సంబంధించిన వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక ఇందిరానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు.. విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాద్‌రావు, షేక్ ఖాదర్‌బాషా, రఘునాథరావు తదితరులు పాల్గొని ఎంతో ప్రాచీనమైన మన తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. కన్నవారినీ, జన్మభూమినీ మరువరాదని, కమ్మనైన మన తెలుగుభాషను ఎవరూ విస్మరించకూడదని తెలిపారు.

# కవుల వేషధారణతో అలరించిన 'జీవీకే చిన్మయ' చిన్నారులు




అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉన్న జీవీకే చిన్మయ విద్యాలయంలో విద్యార్థులకు తెలుగు భాష ఔచిత్యాన్ని ఉపాధ్యాయులు వివరించారు. విద్యాలయ కరెస్పాండెంట్ బద్దెపూడి హరిత, ప్రిన్సిపాల్ జీవీఆర్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. అనంతరం విద్యార్థులు కవుల వేషధారణలతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

### 'గీతామయి'

## వృద్ధులకు అన్నదానం

నెల్లూరు బాలాజీనగర్ వేపదొరువు ప్రాంతంలో ఉన్న గీతామయి ఆశ్రమంలోని వృద్ధులకు ఈనెల 21న స్థానిక లక్ష్మీనరసింహస్వామి సేవా ఫౌండేషన్ వారి సౌజన్యంతో, హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. స్వర్గీయ చోడవరం శ్రీరాములురెడ్డి జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమం నిర్వహించామని ఆయన కుమారుడు రాజారెడ్డి తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు నవీన్, వెంకటేష్, గీతామయి ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ తదితరులు పాల్గొన్నారు.

### పద్యకళా పరిషత్

## సమావేశం.. 25న

ఆంధ్ర వాల్మీకి బిరుదాంకితులు.. బహుముఖప్రజ్ఞాశాలి బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు టౌన్‌హాల్‌లోని జూ. ఆర్‌ఎల్ రెడ్డి భవన్‌లో ఈనెల 25వ తేది సాయంత్రం 6 గంటలకు సారస్వతోపన్యాసం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సభకు పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రోపన్యాసకులు బత్తిన సాయికుమార్‌రెడ్డి పాల్గొని పోలూరు వారు రచించిన 'వాసుదేవ కథాసుధ' అంశంపై ప్రసంగిస్తారని నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. పోలూరి వారి రచనల గొప్పదనాన్ని వివరిస్తూ సాగే ఈ శతజయంతిసభ.. పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో జరగనుండడం ఇది 4వసారి అని పేర్కొన్నారు. సారస్వతవేత్తలు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమానికి తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# వంశీరామ్ పేరుతో.. 3 వేల కోట్ల దోపిడీకి పథకం!

## నకిలీ కంపెనీ పెట్టిన.. మకిలీ మనిషి

### కుట్రతో కోట్లు కొల్లగొట్టాలనుకొన్న కాటంరెడ్డి పట్టాభిరామిరెడ్డి



***"అక్రమ సంపాదనకు కాదేదీ అనర్హం" అన్నట్లుగా, సమాజంలో రకరకాల మోసాలతో డబ్బు సంపాదించడానికి మాయగాళ్ళు అనేక మార్గాలు వెతుక్కుంటున్నారు. అలాంటిదే ఒకటి తాజాగా బయటపడింది. కాటంరెడ్డి పట్టాభిరామిరెడ్డి అనే మోసగాడు తన క్రిమినల్ మేధస్సుతో 3000కోట్ల రూపాయలు వసూలు చేయడానికి పథకం వేశాడు. ఈ కుట్రలో తన కుమార్తె శ్రీషితారెడ్డిని కూడా ఇరికించాలని ప్రయత్నం చేశాడు. తన ఎత్తు బయటపడడంతో ఇప్పుడు వాళ్ళు పరారీలో ఉన్నారు. నెల్లూరుజిల్లా పడుగుపాడు గ్రామంలో వీరిది పేరుగాంచిన ఉన్నత కుటుంబం కావడం గమనార్హం.***

**అసలు కథలోకి వెళ్తే...**

హైదరాబాదులో గత పాతికేళ్లుగా నిర్మాణరంగంలో ప్రఖ్యాతిగాంచిన నెల్లూరీయుల సంస్థ వంశీరామ్ బిల్డర్స్. నెల్లూరు జిల్లా వాసులు బద్వేలు సుబ్బారెడ్డి, బద్వేలు జ్యోతిరెడ్డి ఆ సంస్థకి సారథులు. హైదరాబాదు నగరంలో 80కి పైగా నిర్మాణాలను చేపట్టి అటు గృహ నిర్మాణరంగంలోను, వ్యాపార సముదాయ కల్పనలోనూ అగ్రగామి సంస్థగా నిలిచి పెట్టుబడిదారుల విశ్వాసాన్ని విశేషంగా చూరగొన్న సంస్థ వంశీరామ్. ప్రస్తుతం అనేక ప్రతిష్టాత్మక నిర్మాణాలు ఆ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. గత రెండున్నర దశాబ్దాల కాలంలో పాతికపైగా జాతీయస్థాయి అవార్డులను సొంతం చేసుకుంది వంశీరామ్. ఇది అసలు వంశీరామ్ చరిత్ర.

**ఇప్పుడు నకిలీ వంశీరామ్ కథలోకి వెళ్దాం...**

కాటంరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కాటంరెడ్డి శ్రీషితరెడ్డి అనే తండ్రీకూతుర్లు డైరెక్టర్లుగా "వంశీరామ్ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్" అనే పేరుతో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ముంబాయిలో ఒక సంస్థని 2023, జనవరి 10వ తేదీన రిజిస్టర్ చేశారు. ఆ సంస్థ చిరునామా కూడా హైదరాబాదులో ఇటీవల వరకు ఉండిన అసలు వంశీరామ్ చిరునామానే ఇచ్చారు. సంస్థ రిజిస్ట్రేషన్ అయిన తరువాత తమ సంస్థ ఘనకీర్తి ఇదీ, మా సంస్థ పలానా ప్రాజెక్టులను హైదరాబాదులో విజయవంతంగా పూర్తి చేసింది. వీళ్ళంతా మా క్లయింట్లు అంటూ ఒక బ్రోచర్ వేయించారు. ఆ బ్రోచర్‌లో గతంలో అసలు వంశీరామ్ బిల్డర్స్ నిర్మించిన భారీ నిర్మాణాల బొమ్మలన్నీ వేశారు. వంశీరామ్ వారి లోగో కూడా పెట్టేశారు, వెబ్‌సైట్ అడ్రస్ కూడా అసలు వంశీరామ్‌దే ఇచ్చారు. ఆ తరువాత దండకాలకి తెర లేపారు.

ముంబాయిలో తాము తాజ్ రియాలిటీ అనే సంస్థతో కలిసి రీ డెవలప్‌మెంటు ప్రాజెక్టు(అంటే పాతబడిపోయిన పురాతన అపార్టుమెంట్లని పడగొట్టి కొత్తవి నిర్మించి అందులో ఉన్నవారికి కొత్త అపార్టుమెంటుతో పాటు కొంత లాభం కూడా ఇవ్వడం) పనులను చేపడతామని నమ్మించాడు. "ప్రభాదేవి" అనే ప్రాంతంలో "రాయ్‌చంద్ నివాస్" పేరుతో ఎప్పుడో నిర్మించబడివున్న 20 బ్లాకుల భారీ అపార్ట్‌మెంట్ సముదాయాన్ని తన దోపిడీకి ఎంచుకున్నాడు. ఆ అపార్టుమెంటులో ఉన్న వాళ్ళందరిని నమ్మించి, వారితో ఒప్పందం కూడా చేసుకున్నాడు. వారి దగ్గరనుండి 3వేల కోట్ల రూపాయలని అడ్వాన్సుగా తీసుకోవడానికి స్కెచ్ వేశాడు. అందులోనే నివాసముంటున్న ఒక గృహస్థుడు ముంబైలో తనకి మిత్రుడైన మరో వ్యక్తిని కలిసి ఈ విషయమంతా చెప్పాడు. నీకు హైదరాబాదులో ఎవరైనా తెలుసా అని అడిగాడు. నాకు వంశీరామ్ సుబ్బారెడ్డే తెలుసని చెప్పి ఆ గృహస్తుడిని తీసుకుని ఆ రెండోవ్యక్తి హైదరాబాదుకి వచ్చాడు.

హైదరాబాదుకి వచ్చిన వాళ్లిద్దరూ అసలు వంశీరామ్ బిల్డర్స్ వ్యవస్థాపకులు సుబ్బారెడ్డిని కలసి విషయం చెప్పారు. వాళ్ళు చెప్పింది విన్న సుబ్బారెడ్డి షాక్ అయ్యారు. అసలు తమకు ముంబయిలో ఎవరితోనూ లావాదేవీలు లేవని, అసలు వంశీరామ్ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థే తమదికాదని, ఇదేదో బోగస్ వ్యవహారమని సుబ్బారెడ్డి చెప్పడంతో వాళ్ళు ఖంగుతిన్నారు. వంశీరామ్ సంస్థ ప్రతినిధులు వెంటనే వాకబుచేసి అసలు విషయం తెలుసుకున్నారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో ఫిర్యాదు చేశారు. ముంబైలో పోలీసు కంప్లైంట్ కూడా ఇచ్చారు. ఇప్పుడు నకిలీ "వంశీరామ్" పెట్టిన మకిలీ మనుషుల కోసం పోలీసులు వెతుకుతున్నట్లు సమాచారం.

ఎంత విడ్డూరమో చూశారా! నెల్లూరు జిల్లాకే చెందిన వ్యక్తులకు సంబంధించిన సంస్థని, అదే జిల్లాకి చెందిన కాటంరెడ్డి పట్టాభిరామిరెడ్డి తన అక్రమ సంపాదన కోసం ఎలా వాడుకోవాలని చూశాడో. పాపం ఆయన కూతురు అమాయకురాలని, ఆ అమ్మాయి తండ్రి ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టింది తప్ప, తండ్రి చేసే పాపాలలో ఆమెకి ఎలాంటి సంబంధం లేదని వారి బంధువులు చెప్తున్నారు. ఆ పాప ఉద్యోగం చేసుకుంటూ తన బ్రతుకు తాను బ్రతుకుతోందని అంటున్నారు. పట్టాభిరామిరెడ్డికి మాత్రం ఇలాంటి పనులు అలవాటే అంటున్నారు. గతంలో కూడా ఒక కేసులో ఏడాదికిపైగా జైలు జీవితం గడిపారని చెప్తున్నారు.

ఈ మోసం చూశాక ప్రఖ్యాతిగాంచిన వ్యాపారవేత్తలందరూ అప్రమత్తం కావాల్సిందే. ఆర్‌ఓసి వెబ్‌సైటులోకి వెళ్లి తమ సంస్థలకి డూప్‌లేమైనా తయారయ్యాయా అని చెక్ చేసుకోవాలి. లేదంటే, ఇలాంటి పట్టాభిరామిరెడ్డిలు నగరానికొకడు తయారైపోతాడు. ఈ పట్టాభి తండ్రి చాలా పెద్ద మనిషి. అలాంటి వ్యక్తి కడుపున ఈయనెలా పుట్టాడో, ఆయన చనిపోయి బ్రతికిపోయాడు. లేదంటే ఈ కొడుకు చేసే నిర్వాకాలకి కృంగి కృశించిపోయేవాడు!

# మైపాడు రోడ్డుకు దశ తిరిగింది

- రూ.48 కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన




ఎంతోకాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న మైపాడు రోడ్డుకు ఎట్టకేలకు దశ తిరిగింది. ఏళ్ళ తరబడిగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక, ఎగుడుదిగుళ్లుగా.. మైపాడు ప్రయాణమంటేనే విసుగు పుట్టేవిధంగా ఉన్న ఈ దారి ఇక రహదారి కానుంది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సహకారంతో, కేంద్ర రక్షణశాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి చొరవతో, ఈ రోడ్డు నిర్మాణం కోసం తొలి నుంచీ తపించిన యువ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి కృషితో.. ఎట్టకేలకు మైపాడురోడ్డుకు మంచిరోజులు వచ్చాయి. దాదాపు 48 కోట్ల రూపాయల సిఆర్ఐఎఫ్ నిధులతో ఈ రోడ్డు నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన జరగడంతో ఇందుకూరుపేట మండలంలోని అనేక గ్రామాల ప్రజలతో పాటు, తరచూ మైపాడు బీచ్‌కు వెళ్ళే సందర్శకులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నల చేతుల మీదుగా, నగర మేయర్ స్రవంతి, నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరుల సమక్షంలో ఈ రోడ్డుకు శంకుస్థాపన జరగడం విశేషం.

### తీరిపోనున్న ఇబ్బందులు

మరో కోనసీమ అనిపించేలా జిల్లాలో పచ్చని కొబ్బరి తోటలున్న మండలం ఇందుకూరుపేట. అటు వరి చేలకు, ఇటు రొయ్యల సాగుకు కూడా ఇది అనువైన ప్రాంతం. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఆహ్లాదకరంగా ఉండే సముద్రతీరం మైపాడుకు ఒక వరం. మైపాడుతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలన్నీ ఎప్పుడూ పచ్చదనంతో సస్యశ్యామలంగా ఉంటాయి. అంతేకాకుండా ప్రముఖ పుణ్యక్షేత్రం.. గంగపట్నంలోని శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయం జిల్లాలోని ప్రఖ్యాతి చెందిన దేవాలయాల్లో ఒకటి. పర్యాటకులను బాగా ఆకర్షించే ఈ ప్రాంతానికి రోడ్డు బాగా లేక ఇంతకాలంగా వాహనదారులకు నరకప్రాయంగా ఉండేది. ఇప్పుడా తంటాలన్నీ త్వరలోనే తీరనున్నాయి. విశాలమైన, అందమైన రహదారి నిర్మాణానికి నాయకులు శ్రీకారం చుట్టడంతో మైపాడు రోడ్డుకు ఇక మహర్దశ వచ్చేసినట్లే!...

### పటిష్టంగా వంతెనలు

మైపాడు రోడ్డు నిర్మాణంలో భాగంగా జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరం నుంచి మైపాడు వరకు ఉన్న 19.20 కిలోమీటర్ల రోడ్డును 18అడుగుల నుంచి 40 అడుగుల వెడల్పు చేయనున్నారు. 7.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు, 11.7 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణంతో పాటు జగదేవిపేట, ఆదెమ్మ సత్రం, అంకమ్మసత్రం, రావూరు, నరసాపురం, మైపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కూడా పనిలో పనిగా జరగనుంది.

మైపాడు రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మిస్తుండడంతో, ఈ రోడ్డు పొడవునా ఉన్న 19 పైపు కల్వర్టులు, 3 వంతెనల నిర్మాణాలు కూడా పటిష్టవంతంగా ఉండేలా నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులు లేకుండా ఉన్న ఈ వంతెనల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ముఖ్యంగా ప్రమాదాలకు నిలయంగా ఉన్న యాగర్ల వంతెనను ఇప్పుడు నాలుగు లైన్ల వంతెనగా మార్పు చేస్తుండడంతో ఇక ప్రమాదాలకు చెక్ పెట్టినట్లు అవుతుంది కూడా.



# ఫోటోగ్రాఫర్‌పై దాడి దారుణం

### మండిపడ్డ జర్నలిస్టు సంఘం నాయకులు

అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సభలో ఓ ప్రముఖ దినపత్రిక ఫోటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి జరగడం దారుణమని ఏపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయుడబ్ల్యుజె) నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడులు అమానుషమని, ఫోటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఏపీయుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ఈనెల 19న నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో జర్నలిస్టులు పెద్దఎత్తున ధర్నాందోళన చేపట్టారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లపై దాడులు చేయడం ఘోరమని, ఇకనైనా ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజె నాయకులు ఏ.జయప్రకాష్, జిల్లా అధ్యక్షులు వల్లూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దయాశంకర్, కోశాధికారి హనోక్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రమేష్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జకీర్, ముజీద్, వెంకట్రావు, జర్నలిస్టు సంఘం నాయకులు రాజేష్, నాగరాజు, మహేష్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

### - డీటీసీ చందర్



రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉప రవాణా కమిషనర్ చందర్ చెప్పారు. ఈనెల 19న కోవూరులోని లారీ యార్డ్ అసోసియేషన్‌లో 35వ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపుసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా లారీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అవగాహనా రాహిత్యం, డ్రైవింగ్‌పై అనుభవం లేని కారణంగా, ఓవర్‌టేక్ చేయాలని వాహనాలను వేగంగా నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కావలి ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి, ఏపీ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రావు, కార్యదర్శి నారాయణ, నెల్లూరు ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, ఎంవీఐలు బాలమురళి, స్వప్నిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ ఇండియా ఇన్సురెన్స్ శాఖవారు 10 మంది డ్రైవర్లకు రూ. 3 లక్షల వరకు ఇచ్చిన ఉచిత బీమా బాండ్లను వారికి పంపిణీ చేశారు.

### మార్చి 19 నుంచి..

# కొండ బిట్రగుంటలో బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లపై సమీక్షించిన ఆర్డీఓ

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం.. బోగోలు మండలం కొండ బిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మార్చి 19 నుంచి 25వ తేది వరకు అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇటీవల కావలి ఆర్డీఓ శీనానాయక్ ఆధ్వర్యంలో దేవస్థానం ప్రాంగణంలో జరిగిన అధికారుల సమావేశంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆర్డీఓ సూచించారు. దేవాలయం పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో పలుశాఖల అధికారులతో పాటు, దేవస్థానం ఇఓ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తల్లితండ్రులకు ఇది..'పరీక్షా కాలం'



మార్చి వచ్చేసింది. పిల్లలకు పరీక్షలు దగ్గరి కొచ్చేశాయి. మార్చి 1 నుంచి ఇంటర్‌కు, మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు. షెడ్యూల్ కూడా వచ్చేసింది. గట్టిగా వారం కూడా లేదు. అందుకే పిల్లలు రాత్రింబవళ్ళు పుస్తకాలు వదలడం లేదు. మంచిదే!.. అయితే, వాస్తవానికి ఈ పరీక్షలు పిల్లలకే కాదు.. తల్లితండ్రులకు కూడా. ఎందుకంటే, పదవ తరగతి, ఇంటర్‌మీడియట్‌లు ఉన్నత విద్యలకు పునాది రాళ్ళు. ఈ పరీక్షల్లో మంచి మార్కులు వస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలకు 6.23 లక్షల మంది, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 5.29 లక్షల మంది, రెండవ సంవత్సరానికి 4.76 లక్షల మంది సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులకు తొలి అనుభవంగా ఉంటాయి కనుక, కొంతమేరకు బెరుగ్గా ఉండడం సహజం. ఏమవుతుందో ఏమో అని లోలోపల భయం. పరీక్షలు బాగా రాయగలమా లేదా అని లేనిపోని సందేహం. బాగా చదువుకునే వాళ్ళల్లో కూడా ఈ సంకోచాలు ఉంటుంటాయి. 'ఎట్లయినా మంచి మార్కులతో గట్టెక్కించు దేవుడా!'.. అంటూ వేయి దేవుళ్లకు మొక్కుకుంటుంటారు. ఈ పరిస్థితుల్లో తల్లితండ్రులు ఎంతో సహనం, సంయమనంతో ఉండాలి. మాటిమాటికీ 'చదువు చదువు' అంటూ పిల్లలను బెదరకొట్టకూడదు. వాళ్లు బాధపడేలా మాట్లాడకూడదు. ఇంట్లో పరిస్థితులు, తల్లితండ్రుల ప్రవర్తనలే విద్యార్థుల చదువులపై బాగా ప్రభావం చూపుతాయనే విషయం మరిచిపోకూడదు. విద్యార్థులు చదువుకునే సమయంలో ఏకాగ్రత ముఖ్యం. ఆ ఏకాగ్రత ఉండేలా తల్లితండ్రులు చూసు కోవాలి. 'నీకేం నాన్నా.. నువ్వు బాగా పరీక్షలు రాస్తావ్.. మంచి మార్కులు తెచ్చుకుంటావ్. ఆ నమ్మకం మాకుంది' అంటూ ప్రోత్సహించాలి. ఏదైనా కష్టమైన పాఠాలుంటే ఎలా నేర్చుకోవాలో సూచించాలి. అవసరమైతే సంబంధిత టీచర్లతో మాట్లాడి, తమ పిల్లలు ఆ సబ్జెక్టును చూసి భయపడకుండా చూడాలి. లెక్కలు, ఇంగ్లీషు వంటి సబ్జెక్టుల్లో కూడా పిల్లలు ఇంకా బాగా రాణించేలా ముందు నుంచే తల్లితండ్రులు దృష్టి సారించాలి. తల్లితండ్రుల ప్రోత్సాహం, గురువుల సహకారం ఉంటే విద్యార్థులు ఎన్ని వత్తిడుల నైనా అవలీలగా అధిగమిస్తారని అందరూ గుర్తుంచుకోవాలి.

### పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదు

చాలా మంది విద్యార్థులకు పరీక్షలు దగ్గరకు వస్తున్నాయనుకుంటే చాలు..నిద్ర పట్టదు. రాత్రివేళ ఎక్కువ సమయం చదవాలనుకుంటారు. ఎన్నో పాఠాలు చదవాలి. చదివినవన్నీ గుర్తుండాలి. ఒకపక్క తల్లితండ్రులు, మరోపక్క ఉపాధ్యాయులు అత్యధిక మార్కులు తెచ్చుకుని స్కూల్లో నువ్వే ఫస్ట్ రావాలి అన్నట్లుగా పదేపదే చెప్తుంటారు. ఆ మాటలన్నీ విద్యార్థుల చెవుల్లో రాత్రీపగలు గింగురుమంటూనే ఉంటాయి. వాస్తవానికి పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదు. తరగతి గదుల్లో అనేకసార్లు పెట్టే పరీక్షల వంటివే అవి. కాకపోతే కాస్త హడావిడి ఉంటుంది అంతే. దానికే బెదిరిపోతే ఎలా?..చదువులన్నాక పరీక్షలు మామూలే కదా. మంచి భవిష్యత్తుకు అవి ముఖ్యమైన పరీక్షలు కనుక ఎంతో శ్రద్ధ తీసుకోవాలి. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంటుందనే విషయం గుర్తుపెట్టుకుని, ఎలాంటి బెదురూ లేకుండా పరీక్షలు రాయాలి. తల్లితండ్రులు కోరుకున్నట్లు 'మనమే ఫస్ట్'గా రాణించాలి అనే పట్టుదలతో విద్యార్థులు చదువుకోవాలి.


### తల్లితండ్రులు..
### ఉపాధ్యాయులదే కీలకపాత్ర

పరీక్షల సమయంలో తల్లితండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు ఇబ్బందిపడకుండా చదువుకునే వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యం. వాళ్ళు రాత్రివేళ చదువుకోవాలన్నా, వేకువనే లేచి చదువుకుంటామన్నా కాదు..కూడదు అనకుండా, వారు కోరుకున్న వేళల్లో లేచి చదువుకునేం దుకు సంసిద్ధం చేయాలి. టీవీలకు, ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి. పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బాగా ఆకళింపు చేసుకునేలా చూడాలి. పిల్లలకు ఏవి ఇష్టమో అలాంటి వంటకాలు చేయాలి. వాళ్ళ ఆరోగ్యానికి ఏవి మంచివో వాటినే పెట్టాలి. ఉపాధ్యాయులు గుంపులో గోవిందా అన్నట్లుగా కాక, ఏ విద్యార్థికి ఎలాంటి సబ్జెక్టుల్లో కష్టంగా ఉందో తెలుసుకుని, వారిని భయపెట్టకుండా, దగ్గరకు తీసి వాటిని అర్థమయ్యేట్లు చెప్పాలి. భావిభారత పౌరులుగా వారిని మనం తీర్చిదిద్దాలి అనే లక్ష్యంతో వారికి చదువులు చెప్పాలి.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకునేలా అయ్యావార్లు, అమ్మానాన్నలు శ్రద్ధ తీసుకుంటే పరీక్షల్లో ఆ విద్యార్థికి విజయం తథ్యం. ఆ విజయం ఆ విద్యార్థిదే కాదు.. తల్లితండ్రులది, ఉపాధ్యాయులది కూడా!..


# కల్యాణ వైభవం...!

**సాత్విక్ - సింధు**



భారతీయ వాయుసేన మాజీ ఉద్యోగి, పలు విద్యాసంస్థల్లో కమిటీ సభ్యులుగా విద్యారంగ పురోభివృద్ధికి పాటుపడుతున్న విద్యావేత్త, ప్రస్తుతం జీవీకే సంస్థల్లో కీలక భూమిక పోషిస్తున్న పుచ్చలపల్లి ఆదిశేషారెడ్డి - రేణుకల కుమారుడు **సాత్విక్ రెడ్డి - కృష్ణ సింధు**ల వివాహం ఫిబ్రవరి 17వ తేదీ కావలిలో ఘనంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

**మౌర్య - రచన**



గూడూరు లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బుసారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి - సుదేష్ణల కుమారుడు, స్కూల్ ఛైర్మెన్ బుసారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి - కుంతలల మనుమడు **మౌర్య - రచన** (హైదరాబాద్ వాస్తవ్యులు నరేందర్‌రెడ్డి - హైమావతిల కుమార్తె) ల పరిణయం ఫిబ్రవరి 11వ తేదీ హైదరాబాద్‌లో, 14న రిసెప్షన్ నెల్లూరులో వైభవంగా జరిగాయి. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటా!

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి




వెంకటగిరి ప్రజలకు, వైకాపా నాయకులు..కార్యకర్తలకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా కృషిచేస్తామని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల వెంకటగిరిలోని తమ నివాసంలో వెంకటగిరి మున్సిపాలిటీలోని వైకాపా నాయకులు, వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలతో ఆయన విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వెంకటగిరి రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ ఛైర్మెన్ డాక్టర్ విబి సాయికృష్ణ యాచేంద్రతో కలసి ఆయన ఆ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ, తమ తల్లిదండ్రులు నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ-నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి బాటలోనే వెంకటగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. రానున్న ఎన్నికల్లో వైకాపా విజయానికి అందరం కలిసి పని చేద్దామన్నారు. చంద్రబాబునాయుడి మాటలు నమ్మవద్దని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని చంద్రబాబు ఇప్పుడు మళ్ళీ ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. వైకాపా అధికారంలోకి వచ్చాక, రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, చెప్పిన మాట నిలబెట్టుకునే నేత వైఎస్ జగన్ అని ఆయన అన్నారు. రానున్న ఎన్నికలో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ప్రజలందరూ తమకు మద్దతుగా ఉండాలని రామ్ ఈ సందర్భంగా కోరారు. డాక్టర్ విబి సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ... వెంకటగిరి నియోజకవర్గంలో సమర్థవంతమైన నాయకుడైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఎన్నికల బరిలో నిలుపుతుండడం సంతోషకరమని, వెంకటగిరి మరింత అభివృద్ధి చెందాలంటే రామ్‌కుమార్‌రెడ్డిని వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

### రాజా సర్వజ్ఞతో..రామ్ భేటీ

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈనెల 18న వెంకటగిరిలోని రాజా గారి కోటలో వెంకటగిరి రాజా సర్వజ్ఞ కుమార యాచేంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాల గురించి చర్చించారు.

# ఇస్రో.. మరో అద్భుత విజయం

## జీఎస్ఎల్వి-ఎఫ్14 జయప్రదం



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈనెల 17న ప్రయోగించిన జీఎస్ఎల్వి - ఎఫ్14 రాకెట రామబాణంలా నింగిలోకి దూసుకువెళ్ళి జయప్రదంగా కక్ష్యలోకి చేరింది. ఇస్రో శాస్త్రవేత్తల అపార ప్రతిభాపాటవాలకు నిదర్శనంగా రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో షార్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీహరికోటలోని షార్ రెండవప్రయోగ వేదిక మీదనుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించారు. 2275 కిలోల బరువు కలిగిన ఇన్‌శాట్-3 డిఎస్ ఉపగ్రహాన్ని భూమికి 36,786 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న జియోస్టేషనరీ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టారు. జీఎస్ఎల్వి-ఎఫ్14 రాకెట్ ఆ ఉపగ్రహాన్ని అవలీలగా మోసుకు వెళ్ళి కక్ష్యలోకి చేర్చింది. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసేందుకు, విపత్తులేమైనా ఉంటే వెంటనే హెచ్చరించేందుకు, భూమి-సముద్ర ఉపరితల పర్యవేక్షణకు అవసరమైన విధంగా ఈ రాకెట్‌ను రూపొందించి నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. కేవలం 18.42 నిమిషాల్లోనే ప్రయోగం పూర్తయింది. శాస్త్రవేత్తలు అనుకున్న ప్రకారం రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళ్ళింది. ఎలాంటి అవాంతరాలు లేకుండా కక్ష్యలోకి ప్రవేశించి శాస్త్రవేత్తలకు విజయానందం కలిగించింది. ఈ ఉపగ్రహం ప్రస్తుతం కక్ష్యలో ఉన్న ఇన్‌శాట్-3 డి, ఇన్‌శాట్-3డి ఆర్ ఉపగ్రహాలతో కలసి పనిచేస్తుంది. ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ సోమనాథ్ పర్యవేక్షణలో శాస్త్రవేత్తలు ఈ గగన విజయం సాధించడంతో ప్రజల్లోనూ సంతోషం వెల్లువెత్తింది. ఈ ప్రయోగ విజయంతో మరెన్నో ప్రతిష్టాత్మక రాకెట్లను ప్రయోగించనున్నామని ఈ సందర్భంగా డా.సోమనాథ్ వెల్లడించారు. అందులోనూ ప్రధానంగా నాసా భాగస్వామ్యంతో నిర్వహించనున్న సింథటిక్ ఎపర్చర్ రాడార్ (నిసార్) ప్రయోగానికి కూడా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

### ఇస్రోకు విపిఆర్ అభినందనలు

ఇస్రో చేపట్టిన రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటనలో ఇస్రోకి తన అభినందనలు తెలియజేశారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్14 ద్వారా ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని నింగిలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం దేశానికే గర్వకారణమన్నారు. వాతావరణ మార్పులపై ఈ ఉపగ్రహం పరిశోధించనుందని తెలిపారు. ఈ ప్రయోగంతో ఇస్రో అంతరిక్ష రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సాధించిందని, ఈ ఘనత సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు తన ప్రత్యేక అభినందనలని ఆయన పేర్కొన్నారు.



# దమ్మున్న సీఎం..జగన్ ఒక్కరే!

## - ఆదాల ప్రశంస

దేశ రాజకీయ చరిత్రలోనే ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఎన్నికలకు వెళ్లే ముందు 'నా ప్రజలే నా స్టార్ క్యాంపైనర్లు' అని చెప్పిన దమ్మున్న నాయకుడు ఒక్క వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ నియోజకవర్గం వైఎస్‌ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగస్వాములుగా వలంటీర్లను ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇళ్ల వద్దకే చేర్చిన ఘనత కూడా ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న వాలంటీర్లకు రానున్న రోజుల్లో గొప్ప మేలు జరిగే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని కూడా ఆయన చెప్పారు. నెల్లూరులోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఈనెల 19న జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 32, 33, 34, 35, 36, 37, 38, 41 డివిజన్లలోని సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను వారికి ఆదాల అందజేశారు. ఈ సందర్భంగా అవార్డుల గ్రహీతలైన వాలంటీర్లనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి ఆశయసాధన కోసం వలంటీర్లు చేస్తున్న సేవ మహాద్భుతమని, సేవాతత్పరులైన వలంటీర్లను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. వలంటీర్లు చేస్తున్న గొప్ప సేవకు రానున్న రోజుల్లో మంచి బహుమానం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ద్వారా అందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

### ఏ చిన్న కష్టం వచ్చినా నేనున్నా.. ఆదుకుంటా

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఏ చిన్నపాటి కష్టమొచ్చినా నేనున్నాను ఆదుకుంటానంటూ భరోసా కల్పించారు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి. శాంతియుత వాతావరణంలో ఎన్నికలకు వెళదామని పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఇటీవల తన కార్యాలయంలో 17, 18 మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల ముఖ్య నాయకులతో ఆదాల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గెలిచేది మనమేనని, అందులో ఎటువంటి సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఏ ఒక్క కార్యకర్త కూడా నిర్లక్ష్యం చేయకుండా పార్టీ ఆదేశాలను చక్కగా అమలు చేస్తూ రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించే దిశగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నగర మేయర్ పోట్లూరు స్రవంతి, కార్పొరేటర్లు పెనేటి సుధాకర్, టి. అశోక్ కుమార్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రెండు డివిజన్ల వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోడికి కరోనా వచ్చింది

'కోడికి కరోనా వచ్చింది' అంటూ జనం బెంబేలెత్తిపోయారు. ఇటీవలికాలంలో ఎప్పుడూ లేనిది.. జిల్లాలో ఉన్నట్లుండి 'బర్డ్‌ఫ్లూ' వ్యాధి వ్యాప్తి చెందడం పట్ల ప్రజలు భయపడిపోయారు. కోవూరు మండలంలోని గుమ్మళ్ళదిబ్బ కోళ్ళఫారాల్లోను, పొదలకూరు మండలం చాటగొట్ల గ్రామంలోనూ బర్డ్‌ఫ్లూ దెబ్బకు పెద్దసంఖ్యలో కోళ్ళు చనిపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నెల్లూరు నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోని చికెన్ దుకాణాలను కూడా అధికారులు మూయించేసి, ప్రజలకు కోళ్ళ ద్వారా అనారోగ్యాలు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఈ వ్యాధి వల్ల ఎవరికీ అనారోగ్యం కలగలేదని నిర్ధారించుకుని నాలుగు రోజుల తర్వాత, మంగళవారం నుంచి మళ్ళీ వాటిని తెరిచారు. అయినా, బర్డ్ ఫ్లూ వల్ల ఆరోగ్యానికి ఏ అనర్థం కలుగుతుందోనని జనం మాత్రం చికెన్ అంటేనే హడలిపోతున్నారు. దీంతో మటన్‌కు, రొయ్యలు-చేపలకు గిరాకీ పెరిగింది. ఇదే సందని వ్యాపారులు వాటిని మరింత ఎక్కువ ధరలకు అమ్ముతున్నారంటూ వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## భయపడాల్సిన అవసరం లేదు

పక్షుల ద్వారా వచ్చే 'బర్డ్ ఫ్లూ' వంటి వ్యాధులు ప్రాణాంతకం కాదని, కనుక భయపడాల్సిన అవసరం లేదని, అయితే ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటిస్తే ఏ ప్రమాదం ఉండదని ఈ వ్యాధి నిర్ధారణకు ఢిల్లీ నుంచి జిల్లాకు వచ్చిన కేంద్రబృందం పేర్కొంది. చికెన్ దుకాణాలు తప్పనిసరిగా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు. జాతీయ స్థాయి వ్యాధుల నివారణ కేంద్రం అధికారుల బృందం నుంచి డాక్టర్ సుస్మితా సింఘాల్, డాక్టర్ గురుమిత్‌కౌర్ (లేడీ హార్డింగ్ హాస్పిటల్), మౌలానా అజాద్ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ శ్రేయశర్మలు ఈనెల 19న పొదలకూరు మండలంలోని చాటగొట్ల గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల రక్తనమూనాలు సేకరించి గ్రామస్తులకు బర్డ్‌ఫ్లూ వ్యాధిపట్ల అవగాహన కలిగించారు. అదేవిధంగా కోవూరు మండలం గుమ్మళ్ళదిబ్బలో



**'బర్డ్‌ఫ్లూ'తో భయపడుతున్న జనం గ్రామాల్లో కేంద్రబృందాల పరిశీలన**

కోళ్ళకు వ్యాధి సోకిన ఇంటిని సందర్శించి ఆ కోళ్లను ఎక్కడ నుంచి తెచ్చారు?.. ఎన్ని కోళ్ళు వైరస్‌తో చనిపోయాయి అని ఆరా తీశారు. బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల పశు సంవర్ధకశాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలను కూడా అడిగి తెలుసుకున్నారు.

## ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

బర్డ్ ఫ్లూ వల్ల ఎవరికైనా అనారోగ్యం కలిగితే వెంటనే చికిత్సలకు చొరవ తీసుకోవాలని కేంద్రబృందం అధికారులకు సూచించింది. ఆమేరకు నెల్లూరు పెద్దాసుపత్రిలో తగు ఏర్పాట్లు ఉన్నాయో లేవో పరిశీలించింది. జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెంచలయ్య, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌లను కూడా కలసి కేంద్రబృంద సభ్యులు జిల్లాలో ఈ వ్యాధి వ్యాప్తి కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. వారి వెంట పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగమణి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళి, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్, ఇనమడుగు పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ ప్రీతి తదితరులు పాల్గొన్నారు.



# 'వొలికల బీడు' నవలకు పురస్కారం

## -- ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం --

ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ఆధ్వర్యంలో, పెరసం (పెన్నా రచయితల సంఘం) సారథ్యంలో ఈనెల 18న నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో స్వర్గీయ జమున స్మారక జాతీయస్థాయి నానీల పురస్కారం, డా.జయప్రద నవలా పురస్కారం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ నవలా రచయిత వీఆర్ రాసాని (తిరుపతి) కాటికాపరుల జీవితాలపై రచించిన 'వొలికల బీడు' నవలకు, 'నానీల తీరాన' అనే నానీల సంపుటి కవయిత్రి ఎన్.లహరి (హైదరాబాద్)కి ఈ పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా రాసానికి, లహరికి నిర్వాహకులు అవార్డులు అందజేసి సన్మానించారు.



కవులు చిన్ని నారాయణరావు, మద్దూరులకు సన్మానం

అనంతరం, డాక్టర్ పెళ్లకూరు జయప్రద రచించిన 'విభిన్న శ్వాసలు' కథా సంపుటిని ప్రముఖ కవయిత్రి మహజబీన్ ఆవిష్కరించారు. నానీల తీరం సంపుటిని అవ్వారు శ్రీధరబాబు, వొలికల బీడును డా.గంగిశెట్టి శివకుమార్, విభిన్న శ్వాసలు పుస్తకాన్ని అదువాల సుజాత (కరీంనగర్) సమీక్షించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సభలో అరసం గౌరవాధ్యక్షులు పెరుగు రామకృష్ణ, పెరసం వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచలనరసింహం, నెరసం అధ్యక్షులు అనుమల జయప్రకాష్, పెరసం ప్రధాన కార్యదర్శి తోట సులోచన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, మద్దూరు శ్రీనివాసులు, కోసూరు రత్నంలను నిర్వాహకులు ఆత్మీయంగా సన్మానించారు. తొలుత కవితలో పోటీలో విజేతలైన మక్తాల నరేంద్ర, తిప్పావఝుల నరసింహమూర్తి, దుప్పటి రమేష్‌లకు నగదు బహుమతులందజేశారు.

---






'సంభవామి యుగే యుగే!.. అన్నట్లుగా త్రేతాయుగంలో ఆ దేవుడే రాముడుగా భువిపై అవతరించి మానవాళికి మార్గదర్శనం చేశాడు. సత్యదీక్షతో, ధర్మనిరతితో సకల జనరంజకంగా రాజ్యాన్ని పాలించి.. రామరాజ్యం అంటే ఏమిటో కళ్లకు కట్టినట్లు చూపించాడు. నేటికీ రాముడే పరమదైవంగా అందరి మనసుల్లో కొలువైవున్నాడు. సకల సద్గుణశోభితుడైన శ్రీరామచంద్రుని చరితమే..'రామాయణం'గా మహాకవి వాల్మీకి కావ్యరూపంలో మనకు అనుగ్రహించాడు.

*సుప్రసిద్ధ ఆధ్యాత్మికవేత్త, ప్రముఖ వ్యాఖ్యాత ఊటుకూరు జానకి రామారావు వాల్మీకి మహాకవి రచించిన రామాయణాన్ని ప్రజలకు మరింత సుబోధకం చేయాలనే సదాశయంతో సరళసుందరంగా రాయడమే కాక, సామాజిక మాధ్యమాల్లోనూ రామాయణాన్ని ప్రవచిస్తూ ప్రఖ్యాతిగాంచారు.*

*జానకి రామారావు నివాసం.. ఖమ్మం. ఆంధ్ర యూనివర్శిటీలో ఎమ్మెస్సీ పూర్తిచేసి, సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఆ బ్యాంకులో చీఫ్ మేనేజర్‌గా కూడా పనిచేసి, సుదీర్ఘకాలం..అంటే సుమారు 35 ఏళ్ళ పాటు ఆ బ్యాంకులో పనిచేశారు. భారతమన్నా, రామాయణమన్నా మక్కువ ఎక్కువ. ఆ ఇష్టంతోనే ఆయన అనేక గ్రంథాలను, పురాణాలను, శాస్త్రాలను అధ్యయనం చేశారు. 'నిత్యజీవితంలో భగవద్గీత' అనే గ్రంథాన్ని కూడా వెలువరించారు. మహాభారతాన్ని కూడా తనదైన శైలిలో ఒక గ్రంథంగా వెలువరించే కృషిలో కూడా ఉన్నారు. తనకెంతో ప్రీతిపాత్రమైన రామాయణాన్ని ఈ తరానికి తెలియజేయాలనే సంకల్పంతో ఆయన చేస్తున్న ప్రయత్నం అభినందనీయం.*

*లోకానికే మార్గదర్శకమైన ఆ రామకథను ఆయన 'లాయర్' పాఠకుల కోసం పామరులకు సైతం అర్థమయ్యేలా 'జానకిరామ..రామాయణం' శీర్షిక పేరుతో మన 'లాయర్'లో ఈ వారం నుండీ ఇక.. వారం వారం.. విశదీకరించనున్నారు. సీతారాముల దివ్యచరితాన్ని చదువుకునే సదవకాశం ఇది. రామ కథాసుధలోని మాధుర్యాన్ని, రామాయణంలోని పరమార్థాన్ని 'లాయర్' పాఠకులు ఆస్వాదించి ఆనందిస్తారని ఆశిస్తున్నాం...*

*- సం/-*



**రామాయణం!!**

ఆ పేరు వినగానే అంతులేని శక్తి ఎక్కడినుండో వస్తుంది...

మహర్షి వాల్మీకి వ్రాసిన ఒక ఉత్తమోత్తమ మానవుడి జీవనయానం...

ఒక ఉదాత్తమయిన చరిత్ర...

పితృవాక్యపాలనం.., సోదరప్రేమ.., ఏకపత్నీవ్రతం.., ప్రజారంజక పరిపాలన.., స్నేహధర్మం.., సేవానిరతి.., రాజనీతి..,

ఇలా ఒక్కొక్క విషయము గూర్చి వింటుంటే అవి మన గుండె లోతుల్లో ఎక్కడో తడుతూ ఉంటాయి...

రామాయణం హృదయ సంబంధి.. అంటే రామాయణం చదువుతున్నప్పుడు మన హృదయంలో ఏదో ఒక మూల తెలియని కదలికలు వస్తుంటాయి.

అదే మహాభారతం చదివినట్లయితే మన మేధోవికాసానికి కావలసిన సామాగ్రి అంతా దొరుకుతుంది

...yes! RAAMAAYAN TOUCHES OUR SOUL, MAHABHAARATHA TOUCHES OUR MIND!!

ప్రతినాయకుడి పక్షం నుండి నాయకుడి ప్రశంస ఏ వాఙ్మయంలో ఉంది?...

**రామో విగ్రహవాన్ ధర్మః...**

అంటే ధర్మాన్ని కనుక కరిగించి మూస పోస్తే.. అది తాల్చే ఆకారం "శ్రీ రాముడు"

ఈ మాటలు మారీచుడు రావణాసురుడితో అంటాడు!

శ్రీరాముడి గుణగణాల గురించి మనకు అయోధ్యకాండలో కనపడుతుంది...

**బుద్ధిమాన్, మధురాభాషీ, పూర్వభాషీ, ప్రియంవదః వీర్యవాన్ న చ వీర్యేణ మహతాస్వేన విస్మితః**

ప్రశస్తమైన బుద్ధి గలవాడు, మధురంగా.. అంటే తియ్యగా మాట్లాడేవాడు,

చక్రవర్తి తనయుడు, మహాధనుష్కుడు, సంపదలోను శౌర్యంలోను తనతో తులతూగ గలిగేవాడు లేడు...

అయినా, కించిత్ గర్వం లేకుండా తానే అందరినీ ముందుగా పలుకరిస్తాడు, శత్రువుల విషయంలో గూడా ప్రియవచనాలే పలుకుతాడు...

రాముని గుణాలు ఇవి అని ఏమి చెప్పగలం? సకల సుగుణాభి రాముడు! సర్వలోక మనోహరుడు. లోకంలోని సద్గుణాలన్నీ ఒక చోట చేరి రూపందాలిస్తే ఆ రూపమే శ్రీరాముడు.

ఏ విధమైన ఆలోచన లేకుండా మనం నిత్యం ఎన్నో తప్పులు చేస్తుంటాం, ఒక జీవనకాలంలో లెక్క వేస్తే వాటి సంఖ్య వేలల్లో ఉంటుంది.

అదే మన పిల్లలకు రామాయణ పారాయణం అలవాటు చేసి రామకథ చెప్పవలసిన విధంగా చెపితే...

రామకథాసుధారససారం రంగరించి వారి ఉగ్గుపాలలో పోసి పెంచితే!

జీవన గమనంలో వచ్చే ఆటు పోట్లు ఎదుర్కొనే శక్తి లభించడమే గాకుండా, జీవితంలో తప్పులు, పొరపాట్లు దొర్లినప్పుడు దిద్దుకునే ధీశక్తి లభిస్తుంది.

Sir William Jones అనే ఒక బ్రిటిష్ విద్యావేత్త 18వ శతాబ్దంలోనే ఈవిధంగా అంటాడు.

"భారతదేశం నుండి ఆంగ్లేయులు తెచ్చుకోవలసిన నిజమైన సంపద రామాయణమే! ఎందుకంటే మనిషి మనిషిగా జీవించే సరళమైన హృద్యమైన విధానం నేర్పుతుంది గనుక!"

**వందే వాల్మీకి కోకిలం !!!**

.. (సశేషం)

# కళ్యాణ వైభవం...!

సాయి - కావ్యశ్రీ



నెల్లూరు వాస్తవ్యులు చిల్లకూరు వేణుగోపాల్‌రెడ్డి - వెంకట శేషమ్మల కుమారుడు **డా॥ సాయిప్రతీక్‌రెడ్డి - డా॥ కావ్యశ్రీ** (తిరుపతి జిల్లా అత్తివరం గ్రామ వాస్తవ్యులు కోవూరు జనార్ధనరెడ్డి - లక్ష్మిల కుమార్తెల పెళ్లి ఫిబ్రవరి 14వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభదీవెనెలు.



# విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా

## విఎస్‌యులో పారిశ్రామికవేత్తల సమావేశంలో బిఎంఆర్

విఎస్‌యు విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) చెప్పారు. ఈనెల 21న నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో పలు పరిశ్రమల యాజమాన్యాలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లాకొక విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలనే సంకల్పంతో నెల్లూరులో కూడా విశ్వ విద్యాలయం ఏర్పడిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గత నాలుగేళ్ళలో ఈ విశ్వ విద్యాలయంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. విఎస్‌యు విద్యార్థులకు తమ పరిశ్రమలతో పాటు, ఇతర పరిశ్రమల్లో కూడా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ కె. హేమచంద్రారెడ్డి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జిఎం సుందరవల్లి, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఎఫ్ఎంఎస్ఇ అధ్యక్షుడు ఏపికె రెడ్డి, దొడ్ల డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ దొడ్ల శేషారెడ్డి, హైటెక్ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వి రమణారెడ్డి, విఎస్‌యు రిజిస్ట్రార్ డా.పి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో కేంద్రప్రభుత్వం ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, ప్రజలు వాటి పట్ల అవగాహన కలిగించుకుని ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈనెల 21న నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డు, కొత్తూరు తదితర ప్రాంతాల్లో ఆ పథకాలు ఎలా వినియోగించుకోవాలో ప్రజలకు అవగాహన కలిగించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఉద్యానశాఖ ఉపసంచాలకులు ప్రదీప్‌కుమార్‌తో పాటు బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, ముక్కు రాధాకృష్ణ గౌడ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అర్హులైన వారికి ఆయా పథకాలను వర్తింపజేయాలని వారు సంబంధిత అధికారులకు, సిబ్బందికి విజ్ఞప్తి చేశారు.

# కందుకూరు పరిశీలకునిగా..మన్నెమాల



కావలి నియోజకవర్గానికి చెందిన మన్నెమాల సుకుమార్ రెడ్డిపై వైకాపా గతంలో విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ, తాజాగా ఆయనకు కందుకూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీల కునిగా నియమించింది. వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మన్నెమాల సస్పెన్షన్ రద్దు చేయడమే కాక, రానున్న ఎన్నికల నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గంలో వైకాపా అభ్యర్థి గెలుపు కోసం కృషిచేయాలని ఆదేశిస్తూ, ఈనెల 21న ఆయనకు ఆ బాధ్యతలు కూడా అప్పగించడంతో మన్నెమాల అనుచరవర్గంలో సంతోషం వెల్లువెత్తుతోంది.

# ఆదుకుంటామన్నారు.. మరిచేపోయారు

## ముత్తుకూరులో మత్స్యకార నేత దీక్ష



కృష్ణపట్నం పోర్టును ఏర్పాటుచేసిన సందర్భంలో తరలింపు గ్రామాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న హామీలు నేటికీ నెరవేర లేదని, అదాని సంస్థ వాటిని నెరవేర్చేందుకు కృషిచేయా లని ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరప్రాంత మత్స్యకార సంఘం అధ్యక్షుడు గోవిందు కోరారు. '2007-08లో మా ఇళ్లు, పొలాలు అన్నీ కోల్పోయాం. అప్పట్లో మమ్మల్ని ఆదుకుంటామని నిర్వాహకులు హామీలిచ్చారు. కానీ, నేటికీ వాటిని అమలుచేయలేదని ఆయన బాధను వ్యక్తం చేశారు. ఇకనైనా వారు పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు

# 27న..ఉద్యోగుల 'చలో విజయవాడ'

ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యల సాధన కోసం ఈనెల 27న 'చలో విజయవాడ' కార్యక్రమం చేపట్టనున్నారు. ఆ మేరకు నెల్లూరు ఉద్యోగుల జేఏసీ ఛైర్మెన్, ఏపీ ఎన్జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు చలో విజయవాడ గోడపత్రికలను ఈ నెల 21న ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన 30 శాతం మధ్యంతర భృతిని మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కొత్త డీఏలను తక్షణమే విడుదల చేయాలని, రావాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఈ ఆందోళన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థిని..

# కనిపించడం లేదు

నెల్లూరులోని తమ నర్సింగ్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థిని కనిపించడం లేదంటూ ఆ స్కూలు యాజమాన్యం ఆ విద్యార్థిని తల్లికి తెలియజేయడంతో ఆమె ఆ మేరకు ఈనెల 21న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. వాకాడుకు చెందిన ఓ యువతి నెల్లూరులోని తల్పగిరి కాలనీలోని ఓ స్కూల్‌లో చదువుకుం టోంది. ఈనెల 20న ఆమె శిక్షణ కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లిం దని, అక్కడనుంచి అదృశ్యమైందనే సమా చారం మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## జేవీవీ ఆధ్వర్యంలో..

# సైన్స్ ఎగ్జిబిషన్

కావలి పట్టణంలోని రెడ్‌క్రాస్ కార్యా లయంలో ఈనెల 21న జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసి విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కలిగించారు. కావలి జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవి కుమార్ నేతృత్వంలో విద్యార్థులకు గత వారం రోజులుగా వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, సందేశాత్మక గీతాలు, నృత్యాలు, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విజేతలకు ఆరోజున బహు మతులిస్తామని చెప్పారు. జేవీవీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి హరనాథ్, కోశాధికారి సుబ్బరామశర్మ, ఉపాధ్యక్షులు హరినారపరెడ్డి, సంయుక్త కార్యదర్శి ఖాదర్‌బాషా, విశ్రాంత డైట్ లెక్చరర్ రామ్మూర్తి, సభ్యులు కల్లయ్య పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ళ అరెస్ట్

నెల్లూరు నగరంలోని జ్యోతినగర్‌లోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్న ఏడుగురిని ఈనెల 21న పోలీసులు అరెస్ట్ చేశారు. నగర డిఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్స్‌పెక్టర్ పీవీ నారాయణ ఆధ్వర్యంలో ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# క్రీడలకు ప్రోత్సాహంగా.. ప్రసన్న రూ.లక్ష విరాళం



కోవూరులో జరగనున్న 70వ అంతర్‌జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల నిర్వహణకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి లక్ష రూపాయల విరాళం అందించారు. కబడ్డీ పోటీల వివరాల బ్రోచర్‌ను ఆయన ఈనెల 21న విడవలూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడలను ప్రోత్సహించేందుకు నిర్వాహకులకు ఆయన ఆమేరకు సాయం అందించారు.

# నియంతలు కాలగర్భంలో కలసిపోక తప్పదు

## జగన్ తీరును దుయ్యబట్టిన అజీజ్



నిరంకుశ పాలకులకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని, నియంతలు కాలగర్భంలో కలసిపోక తప్పదని, జగన్ లాంటి నిరంకుశులకు ప్రజలు గుణపాఠం చెప్తారని టీడీపీ నేత అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈనెల 21న ఆయన నెల్లూరులోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, పాలనలోని లోపాలను ఎత్తిచూపడం రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన మీడియా బాధ్యత అని, అయితే జగన్ ప్రశ్నించే గళాలను చూసి భయపడిపోతున్నారని, విమర్శలు తట్టుకోలేక వైకాపా గూండాలతో మీడియావారిపై దాడులు చేయిస్తున్నాడని, అలాంటి హేయమైన చర్యలు దారుణమని ఆయనన్నారు. ఎవరెంత ప్రయత్నించినా ప్రశ్నించే గొంతుకలను ఎవరూ ఆపలేరన్నారు. రాప్తాడులో ఇటీవల ఓ పత్రికా ఫోటోగ్రాఫర్‌పై వైకాపా మూకలు దాడిచేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేయడమేనని, రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవనే విషయం ఆ సంఘటనతో రుజువై పోతోందని ఆయన అన్నారు. మీడియాకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వైకపా ప్రభుత్వం హరించివేస్తుండడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు. మీడియాపై దాడులు చేస్తున్నవారిపై ఇకనైనా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

# పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

## --- అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ ఆదేశం ---

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నులు, వాణిజ్య భవనాలు, తాగునీరు, డ్రైనేజీ పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని నగర కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 21న ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్ను వసూళ్ళలో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులకు షోకాజ్ నోటీసులివ్వాలని ఆదేశించారు. పన్నుల వసూళ్ళ లక్ష్యాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శర్మద, డెప్యూటి కమిషనర్ చెన్నుడు, ఎస్ఇ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పిఆర్‌సి ప్రకటించి..

# ఉద్యోగులకు న్యాయం చేయాలి



ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా పలు సందర్భాలలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ఇకనైనా స్పందించి ఆ హామీలు నెరవేర్చాలని, ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మందా బాబ్జి కోరారు. నెల్లూరులో ఈనెల 18న జరిగిన ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామంటూ హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయాలని కోరుతున్న ఉద్యోగులపై అణచివేత ధోరణితో వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా పిఆర్‌సి ప్రకటించి ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఏ బకాయిలు మంజూరుచేయాలని, సిపిఎస్‌ను రద్దుచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొమ్మల కృష్ణయ్య, నాయకులు రాపూరు రమణయ్య, సంయుక్త కార్యదర్శి కూల్లూరి ప్రభాకర్, కార్యదర్శి పాలకీర్తి శ్రీనివాసులు, అరవ శౌరి తదితరులు పాల్గొన్నారు.

### ఏకగ్రీవంగా..

# పంచాయతీరాజ్ సంఘం ఎన్నికలు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా శాఖ ఎన్నికలు ఈనెల 18న నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా లక్కాకుల పెంచలయ్య, వి. దేవప్రసన్నకుమార్ ఎన్నికయ్యారు. అసోసియేటెడ్ అధ్యక్షులుగా వివి రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా కె.ప్రసాద్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా ఎం ఇమ్మానియేల్, కోశాధికారిగా ఎస్‌కె షాకీర్ అహ్మద్, జెసిసి మెంబర్‌గా వి.పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. స్టేట్ కౌన్సిలర్స్‌గా బీవీ రమేష్ బాబు, బి రమేష్, డివి నాగరాజు, ఇ.ఆనందబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జి.సురేష్‌కుమార్, ఓ.తనోజ్‌కుమార్, ఏ.భవ్యజ్యోతి, జె.విజిత, జి.రమణయ్య ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారిగా ఏవి కృష్ణకుమార్, సహాయ ఎన్నికల అధికారిగా డి. మార్కండేయులు, పరిశీలకులుగా కూచిపూడి మోహన్‌రావు పాల్గొని పర్యవేక్షించారు.

### వేదగిరిపై వేడుకగా..

# భీష్మ ఏకాదశి



భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 20న నెల్లూరు రూరల్ మండలంలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారికి ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన లక్ష తులసిపూజలో భక్తులు పాల్గొని పూజలు చేసుకున్నారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చరణల మధ్య కన్నులపండువగా స్వామివారికి-అమ్మవార్లకు కల్యాణోత్సవం జరిగింది. ఆ తర్వాత గిరి ప్రదక్షిణ మహోత్సవం వైభవంగా సాగింది. ఆలయ ఛైర్మెన్ సురేంద్రరెడ్డి, ఇఓ గిరికృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని-అమ్మవార్లను దర్శించుకున్నారు.

# నర్రవాడలో 'యాదవ చైతన్య వేదిక'

## భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన బీఎంఆర్



దుత్తలూరు మండలం నర్రవాడలో 'యాదవ చైతన్య వేదిక' భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) ఈనెల 19న భూమిపూజ చేశారు. తొలుత ఆయన ఉదయగిరి జడ్పీటీసీ.. భవన స్థల దాత రామాంజనేయులుతో కలసి శ్రీకృష్ణ భగవానునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, యాదవ చైతన్య వేదిక నిర్మాణం కానుండడం సంతోషదాయకమని, అందుకు తనవంతు సహకారం ఉంటుందని చెప్పారు. టీడీపీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్రయాదవ్ మాట్లాడుతూ, ఈ భవనంలో గ్రంథాలయం నిర్వహణకు తనవంతుగా 5లక్షల రూపాయలు విరాళమిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ ఛైర్మెన్..టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్‌ను చైతన్యవేదిక నాయకులు ఘనంగా సన్మానించారు. యాదవుల ఐక్యత కోసం ఈ భవనం నిర్మించడం హర్షదాయకమని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాలంలో ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా పొన్నెబోయిన చెంచురామయ్య ఎన్నికయ్యారని, ఈ నియోజకవర్గంలోని బడుగు బలహీనవర్గాల్లో మంచి చైతన్యం ఉందని భారత చైతన్య యువజనపార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవసంఘం నాయకులు బొమ్మి నాగకిషోర్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త దూడల సుధాకర్ యాదవ్, పలువురు రాష్ట్ర యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో మెడికవర్ క్లినిక్ ప్రారంభం



ప్రపంచ ప్రఖ్యాతి పొందిన శ్రీసిటీలో వైద్యసేవలందించేందుకు నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ వారి నూతన మెడికవర్ క్లినిక్ ఈనెల 19న శ్రీసిటీలో ప్రారంభమైంది. స్థానిక షాపింగ్ ఆర్కేడ్‌లో ఏర్పాటు చేసిన ఆ క్లినిక్‌ను శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు ప్రారంభించగా, మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, ఆంకాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ బిందు భార్గవ్‌రెడ్డి, మార్కెటింగ్ హెడ్ సతీష్‌కుమార్, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ తదితరులు పాల్గొన్నారు. ఈ క్లినిక్ వారంలో అన్నిరోజులు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని మెడికవర్ మార్కెటింగ్ హెడ్ సతీష్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. రెగ్యులర్ డ్యూటీ డాక్టర్‌తో పాటు రోజుకొకరు వంతున వివిధ స్పెషలిస్ట్ డాక్టర్లు క్లినిక్‌లో అందుబాటులో ఉంటారన్నారు. శ్రీసిటీ పరిధిలో ఆరోగ్య వైద్య సదుపాయాలలో భాగంగా మరో క్లినిక్ ప్రారంభం కావడం పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఈ ప్రాంతంలో నివాసముంటున్న పరిశ్రమల ఉద్యోగులు ఈ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**బాధ్యతలు స్వీకరించిన శ్రీసిటీ డీఎస్పీ :**

శ్రీసిటీ నూతన డీఎస్పీగా జీవీఎస్ పైడేశ్వరరావు సోమవారం ఉదయం భాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీలలో ఇప్పటివరకు శ్రీసిటీ డీఎస్పీగా పనిచేసిన జగదీశ్‌నాయక్ బాపట్లకు, భీమవరం డీఎస్పీగా ఉన్న పైడేశ్వరరావు శ్రీసిటీకి బదిలీ అయ్యారు. ఎస్సై హరిప్రసాద్, శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్, ఇతర పోలీస్ సిబ్బంది కొత్త డీఎస్పీని స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు.

# వైకాపా గెలుపు కోసం పనిచేస్తాం

**- రావు శ్రీనివాసరావు**



రానున్న ఎన్నికల్లో వైకాపా గెలుపుకోసం కష్టపడి పనిచేస్తామని నెల్లూరు రూరల్‌లోని 20వ డివిజన్ ఇన్‌చార్జి, శ్రీ ఇరుకళమ్మవారి దేవస్థానం బోర్డు ఛైర్మెన్.. ఇటీవలే రాష్ట్ర వైకాపా సేవాదళ్ కార్యదర్శిగా నియమితులైన రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్) చెప్పారు. తనతోపాటు సేవాదళ్ సంయుక్త కార్యదర్శిగా నియమింపబడిన ఏ.వినోద్‌కుమార్‌రెడ్డితో కలసి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డికి పుష్పగుచ్ఛాలందించి కృతజ్ఞతలు తెలిపారు. తమను రాష్ట్ర సేవాదళ్‌లో నియమించినందుకు ముఖ్యమంత్రికి, సహకరించిన ఆదాలకు ధన్యవాదాలని చెప్పారు.

## టూకీగా...



### బిట్రగుంటలో రైల్వేగార్డుల రక్తదాన శిబిరం

ఆలిండియా గార్డ్స్ అసోసియేషన్ 59వ వార్షికోత్సవం సందర్భంగా బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో రైల్వేగార్డులు నెల్లూరు రెడ్ క్రాస్ వారి సహకారంతో ఈనెల 18న రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఐవి రమణారావు (ఒంగోలు), రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డి, రైల్వే ఉద్యోగుల సంఘం నాయకులు రాజశేఖర్, పిఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో రోడ్డు భద్రతా వారోత్సవాలు

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనల పట్ల ఎంవిఐ రాములు అవగాహన కలిగించారు. అతివేగం వద్దని, ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన లైసెన్సులు, ఇతర సర్టిఫికెట్లన్నీ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని తెలిపారు.

### పోలంరాజుగుంటలో ఉచిత గ్యాస్ కనెక్షన్లు

ముత్తుకూరు మండలంలోని పోలంరాజుగుంటలో ఉన్న 55 మంది లబ్ధిదారులకు ఉజ్వల పథకం కింద గ్రామ సర్పంచ్ దువ్వూరు హారికారెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత గ్యాస్‌కనెక్షన్లు పంపిణీచేశారు. స్థానిక నాయకులు దువ్వూరు కోదండరామిరెడ్డి, సచివాలయం కన్వీనర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### మర్రిపాడులో మద్యం బెల్టుదుకాణాలపై దాడులు

మండల కేంద్రమైన మర్రిపాడులో మద్యం బెల్టు దుకాణాలపై ఈనెల 18న నెల్లూరు సెబ్ అధికారులు దాడులు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 53 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వాటిని ఉదయగిరి సెబ్ అధికారులకు అప్పగించారు.

### సీతారామపురంలో పంటల పరిశీలన

నెల్లూరులోని కృషి విజ్ఞానకేంద్రం-సస్యరక్షణ శాస్త్రవేత్త డా.డి.విజయకుమార్‌నాయక్ ఇటీవల సీతారామపురం మండలంలోని పలుగ్రామాల్లో పంటలు పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలిచ్చారు. మొక్కజొన్న పంటలో కత్తెరపురుగును నివారించడానికి రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పారు. వ్యవసాయాధికారులు నరేంద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### కంటేపల్లిలో ఉచిత వైద్యశిబిరం

వెంకటాచలం మండలం కంటేపల్లిలో విఎస్‌యు జాతీయ సేవాపథకం యూనిట్-2, శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ -నెల్లూరు వారి సౌజన్యంతో ఈనెల 18న చిన్నపిల్లలు, పురిటి బిడ్డలకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ కె.కల్యాణి, డాక్టర్ కె.చిరంజీవి పాల్గొని వైద్యపరీక్షలు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.సునీత, డా. బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### ఏటూరులో విద్యార్థులకు విద్యాసామగ్రి

చేజర్ల మండలంలోని ఏటూరులో సోమవరపు జయరామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఆ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్స్, పెన్సిళ్లు వంటి విద్యాసామగ్రిని అందజేశారు. ఎంఇఓ కళాధర్, ఏటూరు-ఆదూరుపల్లి హెడ్మాస్టర్లు నాగినేని రమణయ్య, రమేష్‌బాబు పాల్గొన్నారు.

### మాలకొండ ఆదాయం రూ. 6.47 లక్షలు

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మాలకొండలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రతి శనివారం భక్తులతో కిటకిటలడుతోంది. ఈనెల 17న శనివారం ఒక్కరోజులోనే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.6,47,178 రాబడి వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

### కె.రాజుపాళెంలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

ఉలవపాడు మండలంలోని కె.రాజుపాళెంలోని మామిడి తోటల్లో పేకాటాడుతున్న ఏడుగురిని ఇటీవల ఉలవపాడు ఎస్‌ఐ బాజిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి వారివద్ద నుంచి 7 మోటార్‌బైక్‌లను, 16,400 రూపాయలను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు.

# శ్రద్ధాంజలి



16.02.1933 - 23.02.2021

ఆదర్శమూర్తి, ఆత్మీయదీప్తి, మా కుటుంబ కీర్తి

**కీ॥శే॥ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారు**

పరమపదించి ఫిబ్రవరి 23, 2024 నాటికి మూడేళ్ళు గడిచాయి.

వారి తృతీయ వర్ధంతి సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ

శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.

గునుపాటి శ్యామల - భార్య
గునుపాటి పార్వతి - కుమార్తె
గునుపాటి వెంకటేశ్వరప్రసాద్ - కుమారుడు
గునుపాటి అనూరాధ - కోడలు

మనుమళ్ళు, మనుమరాళ్ళు

దామోదర్ - ఇందిర - సంజన - మల్లిక - శరత్

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com